ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

**పాత్రికేయులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -185 | పేజీలు - 8 | వెల - 03/- | సోమవారం 13 అక్టోబర్ 2025

# జేడీయూ, బీజేపీ చెరో 101 స్థానాల్లో పోటీ

**బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు కుదిరిన ఎన్‌డీఏ సీట్ల పంపకం**

**ఎల్‌జేపీకి 29, ఆర్ఎల్ఎం, హెచ్‌ఎంలకు చెరో ఆరు స్థానాలు**

**సీట్ల పంపకాలపై నేడు ప్రతిపక్ష పార్టీల సమావేశం**

౦7ల



# కలైమామణి సాయిపల్లవి

**సీఎం స్టాలిన్ చేతుల మీదుగా కలైమామణి పురస్కారం అందుకున్న సాయిపల్లవి**

**కళాకారులకు కలైమామణి పురస్కారాల ప్రధానం**

**90 మంది కళాకారులకు పురస్కారాలు**

**పురస్కారాలు అందుకున్న వారిలో సూర్య, విక్రమ్ ప్రభు తదితరులు**



2లో.

# ఈతకెళ్లి మృత్యుఒడికి

**బాపట్ల జిల్లా వాడరేవు తీరంలో విషాదం**

**అలల తాకిడికి కొట్టుకుపోయి ముగ్గురు మృతి**

**మృతులు అమరావతి 'విట్' విద్యార్థులు**

**అక్కడే మరో ఘటనలో ఇంకో ఇద్దరు గల్లంతు**



చీరాల,,అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్): వారాంతపు సెలవు కావడంతో స్నేహితులతో సరదాగా గడిపేందుకు సముద్ర తీరానికి వెళ్లారు. ఉత్సాహంగా సముద్రంలో మునుగుతూ కేరింతలు కొడుతున్నారు. ఈ క్రమంలో వచ్చిన రాకాసి అల వారి ఆనందాన్ని మింగేసి.. మృత్యుఒడికి చేర్చింది. మిగతా 2లో...





# గ్లోబల్ డిజిటల్ గేట్‌వేగా వైజాగ్..

## విశాఖలో ఏఐ డేటా సెంటర్‌కు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన

**ప్రముఖ సంస్థ సిఫీ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు నిర్మాణం**

**రెండు దశల్లో రూ.1500 కోట్ల భారీ పెట్టుబడి**

**సుమారు వెయ్యి మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు**

**నగరంలో తొలి ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటు**

విశాఖ ,**అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** విశాఖకు మరో అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక సంస్థ తరలివచ్చింది. దేశ కృత్రిమ మేధ సాధికారత దిశగా విశాఖలో మొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ రోజు శంకుస్థాపన చేశారు. భీమిలి నియోజకవర్గం రుషికొండ, మధురవాడ ఐటీ పార్క్ లోని హిల్ నెంబర్ 3లో మిగతా 2లో...





# సుంకాలపై భయపడం

**అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోంది**

**: అధిక సుంకాలపై చైనా మండిపాటు**

బీజింగ్ : తమ ఉత్పత్తులపై మరో వంద శాతం సుంకాలు విధిస్తానంటూ అమెరికా అధ్యక్షు డు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై చైనా మండిపడింది. అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని ఆరోపిస్తూ దాని ఉడత ఊపులకు భయపడే ప్రశ్నే లేదని స్పష్టం చేసింది. మిగతా 2లో...

# తగ్గుతున్న జననాలు..

**ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు**

**2023లో 2 లక్షలకు పైగా తగ్గిన జననాల నమోదు**

**కేంద్ర హోంశాఖ సీఆర్ఎస్ 2023 నివేదిక వెల్లడి**



2లో.

# అమ్మాయిలు రాత్రివేళ బయటికి వెళ్లొద్దు

## : మమతా బెనర్జీ

**పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం**

**అమ్మాయిలు రాత్రి వేళల్లో బయట తిరగవద్దని సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్య**

**ఇలాంటి నేరాలపై తమది జీరో టాలరెన్స్ విధానమని స్పష్టీకరణ**

2లో.



# కల్తీ మద్యం నివారణకు సిట్

**కల్తీ మద్యం నియంత్రణకు 'ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్'**

**ఫిర్యాదుల కోసం 14405 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు**

**శవ రాజకీయాలు, దుష్ప్రచారంపై సీఎం చంద్రబాబు తీవ్ర హెచ్చరిక**



2లో.

# ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టుకు దామోదర్ రెడ్డి పేరు

- **తుంగతుర్తి సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **నల్గొండకు గోదావరి జలాలు ఆయన చలవేనన్న సీఎం**
- **24 గంటల్లోనే జీవో జారీ చేస్తామని వెల్లడి**
- **దామోదర్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ**
- **ఆయన మృతికి సోనియా, ఖర్గే, రాహుల్ సంతాపం తెలిపారన్న సీఎం**

సూర్యాపేట,**అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ దివంగత మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరుదైన గౌరవం ప్రకటించారు. ఆయన సేవలను చిరస్థాయిగా నిలిపేలా ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టుకు 'రాంరెడ్డి దామోదర్ రెడ్డి ప్రాజెక్టు'గా నామకరణం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు రానున్న 24 గంటల్లోనే అధికారికంగా జీవో (ప్రభుత్వ ఉత్తర్వు) జారీ చేస్తామని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ఆదివారం నిర్వహించిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి స్మారక సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మిగతా 2లో...



# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి

**జూబ్లీహిల్స్ ప్రజలు కారు కావాలో, బుల్డోజర్ కావాలో తేల్చుకోవాలన్న కేటీఆర్**

**కాంగ్రెస్ పాలనలో పేదల ఇళ్ల కూల్చివేతలు జరుగుతున్నాయని తీవ్ర ఆరోపణ**

**రెండేళ్లలో రూ. 2.80 లక్షల కోట్ల అప్పులు**

**హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్న కేటీఆర్**

**ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి**

**బీజేపీ తెలంగాణకు పనికిరాని పార్టీ అని ఎద్దేవా**



**అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి చిహ్నమైన 'కారు' గుర్తుకు ఓటేస్తారో, మిగతా 2లో...

# పుంజుకున్న రియల్ రంగం

**రాష్ట్రంలో నిర్మాణ రంగ వృద్ధిరేటు**

**11.97 శాతం పెరుగుదల**

**మూడు నెలల్లో ఏఐ సిటీకి భూమి పూజ**

**: ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



7లో.

# గ్లోబల్ డిజిటల్ గేట్‌వేగా వైజాగ్..

(మొదటి పేజీ తరువాయి)
సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ ఏర్పాటు చేయబోయే 50 మెగావాట్ల ఏఐ ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్ తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కు మంత్రి శంకుస్థాపన చేశారు.

**మంగళవాయిద్యాలతో మంత్రికి స్వాగతం..**
మధురవాడలోని ఐటీ పార్క్ కు చేరుకున్న మంత్రి నారా లోకేశ్ కు మంగళవాయిద్యాలతో నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య ఏఐ ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్ తో పాటు, రుషికొండలో ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకాలను ఆవిష్కరించారు.

**గ్లోబల్ డిజిటల్ గేట్ వేగా విశాఖ..**
ఏఐ ఆధారిత డేటా సెంటర్ రాకతో భారతదేశ తదుపరి గ్లోబల్ డిజిటల్ గేట్ వేగా విశాఖ రూపుదిద్దుకుంటుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. సముద్రపు కేబుల్ కనెక్టివిటీ, ఏఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన 3.6 ఎకరాల భూమిలో రూ.1,500 కోట్ల పెట్టుబడితో సిఫీ సంస్థ రెండు దశల్లో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ ను అభివృద్ధి చేయనుంది. తద్వారా వెయ్యిమందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నూతన కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ సదుపాయం వల్ల సముద్రపు కేబుల్ కనెక్టివిటీ మెరుగుపడనుంది.

**ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా సీనియర్ నేతల హాజరు..**
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పెన్మత్స విష్ణుకుమార్ రాజు, పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, గంటా రవితేజ, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావులతో పాటు సిఫీ చైర్మన్ రాజు వేగేశ్న, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్స్ హర్షా రామ్, రాజేష్ తిరుమల రాజు, సిఫీ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ చెన్నకేశవ్ తో పాటు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఐటీసీ అండ్ ఈ సెక్రటరీ కాటంనేని భాస్కర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్, విశాఖ కలెక్టర్ హరేంద్రప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు ఎన్.యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి

(మొదటి పేజీ తరువాయి)
లేక విధ్వంసానికి ప్రతీకగా మారిన 'బుల్డోజర్'ను ఎంచుకుంటారో తేల్చుకోవాలని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నిక ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చెర్క మహేశ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**పేదల ఇళ్లపై బుల్డోజర్ల దాడి**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లోని పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడుపుతున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా గరీబుల నివాసాలను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి జరగదు, బుల్డోజర్లు మాత్రమే వస్తాయి. ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించాలి" అని ఆయన హెచ్చరించారు. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, రాష్ట్రాన్ని రూ.



2.80 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు.

**హామీలన్నీ మోసమే...!**

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. నెలకు రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కావాలంటే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడమే మార్గమని అన్నారు. "ఈ ఎన్నికలో అధికార పార్టీ ఓడిపోతేనే వారికి భయం పుట్టి హామీలను అమలు చేస్తారు. ఒకవేళ పొరపాటున గెలిపిస్తే, మనం ఎన్ని మోసాలు చేసినా ప్రజలు ఏమీ చేయలేరనే ధీమాతో ఉంటారు" అని వ్యాఖ్యానించారు.
బీసీ రిజర్వేషన్లు, అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి, ముస్లింలకు ఖబరస్థాన్ స్థలం వంటి విషయాల్లోనూ కాంగ్రెస్ మోసపూరితంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. "ప్రజలను తెలిసి తెలిసి మోసం చేయడమే రేవంత్ రెడ్డి నైజం. గతంలో 'మోసం చేసే వాళ్లనే ప్రజలు నమ్ముతారు' అని ఆయనే స్వయంగా చెప్పారు" అని కేటీఆర్ గుర్తుచేశారు.

**బీజేపీపైనా విమర్శలు**
ఈ సందర్భంగా బీజేపీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏమాత్రం పనికిరాని పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే ఆ ఓటును మోరీలో వేసినట్లేనని ఆయన ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ. 10,000 పంచి గెలవాలని చూస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం తిరిగి అభివృద్ధి పథంలో పయనించాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని, అందుకు జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం మినహా రేవంత్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.

# కల్తీ మద్యం నివారణకు సిట్

అమరావతి,**అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కల్తీ మద్యం.. వైసీపీ ప్రభుత్వం నుంచి వారసత్వ సంపదగా వచ్చిందని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఓ వైపు గంజాయ్, మరోవైపు కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేశారని సీఎం మండిపడ్డారు. జగన్ నేతృత్వాన వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాల్ని గుర్తు చేసే ప్రయత్నం చేశారు ముఖ్యమంత్రి. కల్తీ మద్యాన్ని చట్టబద్ధం చేసి మరీ, గత పాలకులు నేర సామ్రాజ్యం సృష్టించారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.
కల్తీ మద్యం నివారణకు సిట్, గంజాయ్ నివారణకు ఈగల్ బృందాలు ఏర్పాటు చేసి కట్టడి చేశామని చంద్రబాబు చెప్పారు. ఇంత చేస్తున్నా కొందరు కాదని బరితెగిస్తే చూస్తూ ఊరుకుంటామా? అని చంద్రబాబు ప్రశ్నించారు. నేరస్థులు ఏ ముసుగులో వచ్చినా కట్టడి చేసి తీరుతామన్నారు. ఎంతటి వారైనా, ఎవరైనా ఉపేక్షించేది లేదని.. కల్తీ మద్యం నివారణ దిశగా ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ ను అందుబాటులోకి తెచ్చామని చంద్రబాబు తెలిపారు. ప్రతీ మద్యం బాటిల్‌పై ఉండే లేబుల్‌ని స్కాన్ చేయటం ద్వారా మద్యం నాణ్యత తెలుసుకునేలా యాప్ రూపకల్పన చేశామని చంద్రబాబు వెల్లడించారు. వ్యవస్థ ప్రక్షాళన దిశగా ఉత్తమ విధానాలు అందుబాటులోకి తెచ్చామన్నారు చంద్రబాబు.'రాజకీయ ముసుగు తొడుక్కొని నేరాలు చేయాలని చూస్తున్నారు. నా దగ్గర అలాంటి వాళ్ల ఆటలు సాగవు. నకిలీ మద్యంపై సిట్ ఏర్పాటు చేస్తున్నాం. నకిలీ మద్యం తయారీకి చెక్ పెట్టేందుకు టెక్నాలజీ తీసుకువస్తున్నాం. ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ అందుబాటులోకి తెస్తున్నాం. మద్యం నాణ్యత తెలుసుకునేలా యాప్ ఏర్పాటు చేస్తున్నాం. హోలోగ్రామ్ స్కాన్ చేస్తే బ్యాచ్ నంబర్, మద్యం క్వాంటిటీ, ధరలు వంటి పూర్తి వివరాలు వస్తాయి' అని చంద్రబాబు అన్నారు.
అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించారు. లిక్కర్ అంశంతో సహా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చంద్రబాబు మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చిన సమస్యల్లో నకిలీ మద్యం ఒకటి. గత ప్రభుత్వం నకిలీ మద్యాన్ని ఏరులై పారించి లీగలైజ్ చేసింది. గంజాయిని వాణిజ్య పంటగా భావించి గత పాలకులు పండించారు. గంజాయి సరఫరా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవస్థలను ప్రక్షాళన చేయడం ప్రారంభించాం. గత ప్రభుత్వంలోని పెద్దలు.. తమకు సంబంధించిన మనుషులకు చెందిన కంపెనీల బ్రాండ్లనే అమ్మారు. బలవంతంగా డిస్టలరీలను హ్యాండోవర్ చేసుకున్నారు.. ఓ నేర సామ్రాజ్యాన్ని సృష్టించారు. గత ప్రభుత్వంలో జరిగిన మద్యం దోపిడీపై సిట్ వేశాం. విచారణ జరుగుతోంది. మద్యం విషయంలో కొందరు ఇంకా కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారు. నేరాలు చేయడం.. ఎదుటి వారిపై ఆ నేరాల్ని మోపి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.. కంట్రోల్లో పెడతాం. గతంలో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం మన రాష్ట్రానికి వచ్చేది. గత పాలనలో నాణ్యమైన మద్యం లేకపోవడం.. ధరలు విపరీతంగా ఉండడంతో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చుకోడానికి చాలా మంది ప్రయత్నించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. బెస్ట్ మద్యం పాలసీ తెచ్చాం' అని చంద్రబాబు అన్నారు.
'శవరాజకీయాలు చేయటంలో ఆరితేరిన వారు కుట్రలకు యత్నిస్తున్నారు. తండ్రి చనిపోతే ఆ శవం నుంచే రాజకీయం మొదలుపెట్టిన వారు బ్లూ మీడియాని అడ్డుపెట్టుకుని తప్పుడు ప్రచారాలకు తెరలేపారు. రాజకీయం కోసం ఎలాంటి కుట్రలు పన్నినా ఉపేక్షించేది లేదు. ప్రభుత్వ విశ్వసనీయత ఎవరు దెబ్బతీయాలని చూసినా చూస్తూ ఊరుకోం. ఎక్సైజ్ అధికారులు కూడా ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయకుంటే ఇబ్బందులు పడతారు. అస్తవ్యస్తం చేసిన శాఖను సమగ్ర ప్రక్షాళన దిశగా ముందుకెళుతున్నాం. ప్రభుత్వ చర్యల్ని పరీక్షిద్దామని అనుకుని బలిపశువులు కావొద్దు' అని చంద్రబాబు హెచ్చరించారు.

# సుంకాలపై భయపడం

ఈ మేరకు చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీజింగ్‌తో కలిసి నడవా లని అనుకుంటే ఈ విధంగా తరచూ బెదిరింపులకు దిగడం పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. చైనాపై అధిక సుంకాలు విధిస్తానంటూ ప్రతి సంద ర్భంలోనూ హెచ్చరించడం సరికాదని చెప్పారు.
రేర్ ఎర్త్ ఖనిజాల ఎగుమతిపై ఆంక్షలు
ట్రంప్ తాజా ప్రకటనతో చైనా వస్తువులపై విధించిన సుంకాలు 130 శాతానికి చేరాయి. ట్రంప్ చర్యకు ప్రతిగా చైనా కూడా రేర్ ఎర్త్ పరికరాలు, వాటికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానంపై తాజాగా ఎగుమతి ఆంక్షలు విధించింది. దేశ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. వీటిని ఎగుమతి చేయాలని అనుకునే వారు విధిగా ప్రత్యేక లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. అమెరికా చర్యకు ఈ ప్రతి చర్య అవసరమేనని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. అమెరికా కనుక సుంకాలపై పట్టు వీడని పక్షంలో తమ చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.అమెరికా చర్యలు చైనా ప్రయోజనాలకు తీవ్ర హాని కలిగిస్తాయని, రెండు దేశాల మధ్య నెలకొన్న ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య చర్చల వాతావరణాన్ని దెబ్బ తీస్తాయని చెప్పింది. మాడ్రిడ్‌లో వాణిజ్య చర్చలు జరిగినప్పటి నుంచీ తమపై అమెరికా నిరంతరాయంగా ఆంక్షలు విధిస్తూనే ఉన్నదని ఆరోపించింది. 'మేము జగడాన్ని కోరుకోవడం లేదు. అలాగని పోరుకు భయపడేదే లేదు' అని తేల్చి చెప్పింది. ప్రపంచ వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ఏకపక్ష వాణిజ్య ఆంక్షలకు స్వస్తి చెప్పాలని చైనా ఎప్పటి నుంచో కోరుతున్నప్పటికీ అమెరికా దానిని పెడచెవిన పెడుతోంది.అమెరికా, చైనా మధ్య వివాదానికి ప్రధాన కారణం రేర్ ఎర్త్ ఖనిజాలు. సెమీకండక్టర్లు, విద్యుత్ వాహనాలు, రక్షణ పరికరాల ఉత్పత్తికి ఇవి అత్యవసరం. ఒక్క మాటలో చెప్పాలంటే జెట్ ఇంజిన్ల నుంచి రాడార్ వ్యవస్థల తయారీ వరకూ రేర్ ఎర్త్ ఖనిజాల అవసరం ఉంటుంది. ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు వంటి వినియోగ ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీకీ ఇవి అవసరమే. ప్రపంచ రేర్ ఎర్త్ మైనింగ్‌లో చైనా వాటా సుమారు 70 శాతం. ప్రపంచ రేర్ ఎర్త్ ప్రాసెసింగ్‌లో సైతం 90 శాతం వరకూ చైనాదే ఆధిపత్యం.చైనాపై సుంకాలు పెంచుతూ అమెరికా తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో ఈ ఏడాది ప్రారంభంలో రేర్ ఎర్త్ ఎగుమతులను బీజింగ్ నిలిపివేసింది. సంప్రదింపుల నేపథ్యంలో అవి తిరిగి ప్రారంభమయ్యాయి. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే ఎగుమతులపై తాజాగా నియంత్రణలు విధించామని, వీటిని నిషేధంగా చూడకూడదని చైనా వాణిజ్య శాఖ తెలిపింది. ప్రమాణాలను పాటించే ఎగుమతులకు అనుమతులు కొనసాగుతాయని చెప్పింది.

# కలైమామణి సాయిపల్లవి

చెన్నై **అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):**
కళారంగంలో విశేష కృషి చేసిన ప్రతిభావంతులను తమిళనాడు ప్రభుత్వం సత్కరించింది. చెన్నైలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ 2021, 2022, 2023 సంవత్సరాలకు గాను "కలైమామణి" పురస్కారాలను ప్రదానం చేశారు.మొత్తం 90 మంది కళాకారులు వివిధ విభాగాలలో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. 2021 సంవత్సరానికి గాను నటనా విభాగంలో ప్రముఖ నటి సాయిపల్లవి ఈ పురస్కారానికి ఎంపిక కాగా, ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా ఆమెకు అవార్డును అందజేశారు.అలాగే, నటులు ఎస్.జే. సూర్య, విక్రమ్ ప్రభు తదితరులు కూడా పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. సంగీతం, నృత్యం, నాటకం, సినిమా వంటి విభాగాల్లో విశేష కృషి చేసిన కళాకారులను ప్రభుత్వం గుర్తించి సత్కరించింది.కలైమామణి పురస్కారం తమిళనాడులో కళారంగానికిచ్చే అత్యున్నత గౌరవంగా పరిగణించబడుతుంది. ఈ పురస్కారాల ద్వారా కళా సాంస్కృతిక రంగాన్ని ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# తగ్గుతున్న జననాలు..

### ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు

### 2023లో 2 లక్షలకు పైగా తగ్గిన జననాల నమోదు

### కేంద్ర హోంశాఖ సీఆర్ఎస్ 2023 నివేదిక వెల్లడి

దేశంలో జననాల నమోదు గణనీయంగా తగ్గుముఖం పడుతోంది. 2022 సంవత్సరంతో పోలిస్తే 2023లో రెండు లక్షలకు పైగా జననాలు తక్కువగా నమోదయ్యాయి. గత ఐదేళ్ల కాలంలో జననాల నమోదు తగ్గడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇదే సమయంలో మరణాల నమోదులో స్వల్ప పెరుగుదల కనిపించింది. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) విడుదల చేసిన 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్) 2023' నివేదికలో ఈ కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.ఈ నివేదిక ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా 2.52 కోట్ల జననాలు నమోదయ్యాయి. ఇది 2022లో నమోదైన జననాలతో పోలిస్తే 2,32,094 (0.9 శాతం) తక్కువ. దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గుతోందనడానికి ఇది ఒక సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు, 2023లో మొత్తం 87 లక్షల మరణాలు నమోదయ్యాయి. 2022తో పోలిస్తే ఇది కేవలం 9,749 (0.1 శాతం) మాత్రమే ఎక్కువ కావడంతో, మరణాల సంఖ్య దాదాపు స్థిరంగా ఉన్నట్లేనని నివేదిక స్పష్టం చేసింది.ఈ నివేదికలో మరికొన్ని ఆందోళనకరమైన అంశాలు కూడా ఉన్నాయి. దేశంలో ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో జరిగే ప్రసవాల శాతం క్రమంగా తగ్గుతోంది. 2022లో ఇది 75.5 శాతంగా ఉండగా, 2023 నాటికి 74.7 శాతానికి పడిపోయింది. కరోనా మహమ్మారికి ముందు ఇది 80 శాతానికి పైగా ఉండేది.
అలాగే, సరైన సమయంలో వైద్య సహాయం అందక ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. 2022లో ఇలాంటి మరణాలు 50.7 శాతంగా నమోదు కాగా, 2023లో ఆ సంఖ్య 53.4 శాతానికి పెరిగింది. కరోనాకు ముందు ఈ తరహా మరణాలు 40 శాతం లోపే ఉండటం గమనార్హం. ఈ గణాంకాలు దేశ ఆరోగ్య వ్యవస్థ పనితీరుపై కొత్త చర్చకు దారితీస్తున్నాయి.

## ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టుకు దామోదర్ రెడ్డి పేరు

(మొదటి పేజీ తరువాయి)
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నల్గొండ గడ్డపై గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నాయంటే అది కేవలం దామన్న ధైర్యం, పట్టుదల వల్లే సాధ్యమైంది. ఆయన ఒత్తిడితోనే నాటి ప్రభుత్వం ఎస్సారెస్పీ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లింది" అని గుర్తుచేశారు. తుంగతుర్తి ప్రజల అభివృద్ధి కోసం ఆర్‌డీఆర్ నిస్వార్థంగా పనిచేశారని సీఎం కొనియాడారు.దామోదర్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, అధిష్ఠానం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. ఆయన మృతి పట్ల కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారని తెలిపారు. సోనియా గాంధీ స్వయంగా ఆయన కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారని వెల్లడించారు.
ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలు తీరతాయని, ఇది దామోదర్ రెడ్డి ఆశయాలకు దక్కే నిజమైన నివాళి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ఈతకెళ్లి మృత్యుఒడికి

**(మొదటి పేజీ తరువాయి)**
వేర్వేరుగా జరిగిన రెండు ఘటనల్లో ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులు మరణించగా.. మరో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు తీరప్రాంతంలో ఆదివారం ఈ పెనువిషాదం చోటుచేసుకుంది. అమరావతిలోని విట్ కళాశాలకు చెందిన బి.సాయి మణిదీప్ (20), వంగల శ్రీసాకేత్ (20), పెంటెల జీవన్ సాత్విక్ (20) మరో నలుగురు మిత్రులతో కలిసి ఆదివారం బస్సులో వాడరేవు తీరానికి వచ్చారు. సాయంత్రం వరకు సరదాగా గడిపారు. మణిదీప్ సముద్రంలో ఈతకొట్టే క్రమంలో లోతుకు వెళుతుండగా.. అప్పటికే పలుమార్లు కేకలు వేసిన శ్రీసాకేత్, సాత్విక్.. మణిదీపను వెనక్కు తెచ్చేందుకు వెళ్లారు. ఆ సమయంలో అలల తాకిడికి మణిదీప్ కొట్టుకుపోతుండగా కాపాడేందుకు ప్రయత్నించిన ఇద్దరు మిత్రులు కూడా గల్లంతయ్యారు. వారి కోసం గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాసేపట్లోనే అక్కడికి సమీపంలోని ఒడ్డుకు మృతదేహాలు కొట్టుకొచ్చాయి. మరణించిన ముగ్గురూ హైదరాబాద్‌కు చెందిన వారిగా గుర్తించారు. మరోవైపు వేటపాలెం మండలం వడ్డె సంఘం గ్రామానికి చెందిన కుంచన షారోన్ (18) రాజమండ్రిలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన కోట గౌతమ్ (16) చీరాలలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఇద్దరూ కలిసి ఆదివారం వాడరేవు తీరానికి వచ్చారు. సరదాగా సముద్రంలోకి దిగి అలల తాకిడికి గల్లంతయ్యారు. వీరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# అమ్మాయిలు రాత్రివేళ బయటికి వెళ్లొద్దు

### : మమతా బెనర్జీ

పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో వైద్య విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అమ్మాయిలు, ముఖ్యంగా హాస్టళ్లలో ఉండే విద్యార్థినులు రాత్రి వేళల్లో బయటకు వెళ్లకపోవడం మంచిదని ఆమె సూచించారు. అయితే, ఇలాంటి కిరాతక ఘటనల పట్ల తమ ప్రభుత్వం ఎంతమాత్రం సహించబోదని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు ఆమె స్పష్టం చేశారు.ఆదివారం కోల్‌కతా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ, "బయటి రాష్ట్రాల నుంచి ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారు. రాత్రిపూట ఎవరు ఎక్కడికి వెళుతున్నారో పోలీసులకు తెలియదు. ప్రతి ఇంటికీ వెళ్లి పోలీసులు కాపలా కాయలేరు కదా. రాత్రి 12:30 గంటలకు బయటకు వెళ్లినప్పుడు ఏదైనా జరిగితే...! మేము ఆ ఘటనను ఖండిస్తున్నాం. ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ అందరికీ ఉంది, కానీ జాగ్రత్తగా ఉండాలి" అని మమతా బెనర్జీ అన్నారు. విద్యార్థుల భద్రత విషయంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీ యాజమాన్యానికి కూడా బాధ్యత ఉంటుందని ఆమె గుర్తుచేశారు.
ఒడిశాలోని జలేశ్వర్‌కు చెందిన ఓ యువతి దుర్గాపూర్‌లోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి ఆమె తన స్నేహితుడితో కలిసి భోజనం కోసం కాలేజీ క్యాంపస్ బయటకు వెళ్లింది. ఆ సమయంలో బైక్‌లపై వచ్చిన కొందరు యువకులు వారిని వెంబడించి, అసభ్యంగా ప్రవర్తించారు. విద్యార్థిని స్నేహితుడిని బెదిరించి పంపించివేసి, ఆమెను సమీపంలోని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె మొబైల్ ఫోన్ కూడా లాక్కుని పడేశారు.కాసేపటి తర్వాత ఆ స్నేహితుడు మరికొందరితో కలిసి అక్కడికి చేరుకోగా, విద్యార్థిని గాయాలతో కిందపడి ఉండటాన్ని గమనించి ఆసుపత్రికి తరలించారు. కాలేజీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ఘటనకు సంబంధించి షేక్ రియాజుద్దీన్, అపు బౌరి, ఫిర్దోస్ షేక్‌లను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్‌కూడా స్పందించింది. ఐదు రోజుల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలని పశ్చిమ బెంగాల్ డీజీపీని ఆదేశించింది. విద్యార్థినికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మెడికల్ కాలేజీ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

# మార్కెట్ హమాలీల హామీలు నెరవేర్చండి

### - ఐఎఫ్టి యు, రైతు కూలి సంఘం లు నాయకులు డిమాండ్



**ఎమ్మిగనూరు, అక్టోబర్, 12,(రిపబ్లిక్ న్యూస్):**
వ్యవసాయ మార్కెట్ యార్డ్ సూపర్వైజర్ ఎర్రి స్వామికి ఐ ఎఫ్ టి యు నాయకులు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు మార్కెట్ యార్డ్ లో పనిచేస్తున్న హమాలీలను ఉద్దేశించి ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి ఎస్ బాలరాజు మాట్లాడుతూ హమాలీలకు సంవత్సరానికి రెండు జతలు యూనిఫామ్ లు ఇవ్వాలని మరియు ఈఎస్ఐ పిఎఫ్ వంటి సౌకర్యం కల్పించాలని 60 సంవత్సరాల నిండిన అమాలికి పింఛను ఎనిమిది వేల రూపాయలు ఇవ్వాలని కమిషన్ ఏజెంట్ దగ్గర పనిచేస్తున్న హమాలికు కాలు చేయి ప్రమాదవశాత్తు ఏమైనా జరిగిన కమిషన్ ఏజెంట్ బాధ్యత వహించాలని అన్నారు హమాలీల లైసెన్లు రెన్యువల్ చేయాలి అదే విధంగా లైసెన్స్ లేనివారికి కొత్త లైసెన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు పట్టణ కార్యదర్శి ఎస్ బాబు ఐఎఫ్టియు నాయకులు మల్లికార్జున అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సత్యన్న, పెద్ద రెడ్డి, వీరేష స్వామి, భాష, తదితరులు పాల్గొన్నారు

# శ్రీ సుబ్రహ్మణ్య స్వామిపల్లకి సేనా ఉత్సవం



**ఆత్మకూరు అక్టోబర్ 12 ,( రిపబ్లిక్ న్యూస్):**మండలంలోని పంపనూరు గ్రామంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పల్లికి ఉత్సవ సేవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తుల ఆరాధ్య దైవం అయిన శ్రీ స్వాములవారికి పంచామృత అభిషేకం అలంకరణక పూజార్చన మహా నైవేద్యం మహా మంగళహారతి పల్లకి సేవా కార్యక్రమంతో పాటు కుజదోష కాలసర్పదోష నివారణ కొరకు స్వామి వారికి మూలమంత్ర బీజాక్షరహెూ నిర్మించినట్లు ఆలయ నిర్వహణ అధికారి బాబు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కమిటీ వారిచే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారితో పాటు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ కనకదాసు విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



**ఆత్మకూరు,అక్టోబర్ 12 (రిపబ్లిక్ న్యూస్)** బీసీ కురుబ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ కనకదాసు విగ్రహం ఏర్పాటు చేసేందుకు సనప గ్రామ కురుబ పెద్దలు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు మండలం సనప గ్రామంలో కురుబ వీధుల నడిబొడ్డున ఆదివారం ఉదయం గ్రామ కురుబ కుల పెద్దలు సంఘటితంగా ఏకమై, శ్రీ కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించుకుని, విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుబకుల పెద్దలు, కురుబయువత, రాజకీయ పార్టీలు కతీతంగా కురుబ కులస్తులందరూ పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా

### వైసీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం కరపత్రాల ఆవిష్కరిణ



**గుత్తి అక్టోబర్ 12 (రిపబ్లిక్ న్యూస్)**అనంతపురం జిల్లా గుత్తి ఆర్ అండ్ బి బంగ్లాలో ఆదివారం వైసీపీ పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వైసిపి పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నేమతాబాద్ రఘు నాథ్ రెడ్డి,వైసిపి పట్టణ, మండల మాజీ కన్వీనర్లు గోవర్ధన్ రెడ్డి,హుస్సేన్ పీరా మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వైద్య, విద్య పేదోడికి వైద్య సేవలు దూరం చేసేందుకు కూటమి సర్కార్ ప్రయత్నిస్తుందన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు.. ఈనెల 10 నుంచి నవంబర్ 22వ తేదీ వరకు మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ పై పలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. కావున రేపు జరిగే నిరసన కార్యక్రమానికి వైసీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, వైసీపీ పట్టణ మండల మాజీ కన్వీనర్లు గోవర్ధన్ రెడ్డి, పీరా, వైసీపీ మండల ఉపాధ్యక్షులు నేమతాబాద్ రఘునాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు సివి.రంగారెడ్డి, సుభాష్ రెడ్డి,రంగస్వామి,గురు ప్రసాద్ యాదవ్,నూర్ నాయక్, మునిసిపల్ వైసీపీ వింగ్ అధ్యక్షుడు యువనాయకుడు మహమ్మద్ షఫీ,వైసీపీ జిల్లా మైనారిటీ నాయకులు కటిక మున్న, కటిక అన్వర్, డిష్ అన్వర్,వైఎండి ఫయాజ్, కౌన్సిలర్లు రమణ, వెల్డింగ్ రవూఫ్, గోపీనాథ్ రెడ్డి, మరియు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అనుబంధ సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రధాని పర్యటనలో సమర్థవంతంగా పనిచేయండి

### అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకోండి -నగరపాలక అధికారులకు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశం







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 12)**
ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా నగరపాలక అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కమిషనర్ పి. విశ్వనాథ్ ఆదేశించారు. ఆదివారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా రహదారుల మరమ్మత్తు పనులు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు, సైన్ బోర్డులు, దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య చర్యలు, మొబైల్ టాయిలెట్లు, స్నాక్స్ మరియు హెల్ప్ డెస్క్ ఏర్పాట్లపై పూర్తి స్థాయి దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. అదేవిధంగా నగరంలో సుందరీకరణ, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. ప్రతి విభాగం అధికారులు తమ పనులు సమయపాలనతో పూర్తి చేసి, సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన ఆదేశించారు. అలాగే ఇతర నగరాల నుండి వచ్చే మున్సిపల్ ఉన్నతాధికారులు, కమిషనర్లు, పారిశుద్ధ్య సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా వసతి, ఆహారం, రవాణా వంటి అవసరమైన సౌకర్యాలు సమకూర్చాలని సూచించారు. సమీక్ష సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇన్‌చార్జ్ ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

# సాంకేతిక భద్రతతో నేరాల నియంత్రణ

### వీఐపీ, వీవీఐపీలకు భారీ భద్రత

### సీసీ కెమెరాల ఏర్పాటుకు భూమి పూజ

### జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఐపీఎస్



**శ్రీ సత్యసాయి ప్రతినిధి, అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):**
శ్రీసత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పుట్టపర్తిలో భద్రతను కట్టుదిట్టం చేస్తూ 216 కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, అధునాతన సీసీ కెమెరాలు, డే అండ్ నైట్ విజన్ డ్రోన్లతో భారీ భద్రతా ఏర్పా ట్లు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఐపీఎస్ వెల్లడించారు. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వారి సహకారంతో రూ. ఒక కోటి ,39 లక్షలు వ్యయంతో గణేష్ సర్కిల్లో ఆదివారం సిసి కెమెరాల ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆర్డీవో సువర్ణ పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు.

**జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ పత్రికావిలేకరులతో మాట్లాడుతూ...**
దేశ విదేశాల నుంచి భగవాన్ శ్రీ సత్యసాయి జయంత్యుత్సవాలకు వీఐపీలు, వీవీఐపీలు అధిక సంఖ్యలో విచ్చేస్తారని, దాదాపు 10 లక్షల మంది దాకా భక్తులు వేడుకల్లో పాల్గొనే అవకాశం ఉండడంతో పటిష్టమైన భద్రతాపరమైన ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తరువాత నవంబర్ 2 నుంచి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలను దిగ్విజయం చేసే విధంగా ప్రముఖులు, భక్తులకు తగిన భద్రత పరమైన ఏర్పాట్లు చేపడతామన్నారు.ప్రస్తుతం ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్(ఎ ఎన్. పిఆర్) కెమెరాలు 10, స్టాటిక్ కెమెరాలు 169, ఇతర కెమెరాలు 47.. మొత్తం 216 కెమెరాలను పుట్టపర్తి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పుట్టపర్తికి వచ్చే ప్రతి రూటు , పట్టణానికి చుట్టుపక్కల పది కిలోమీటర్ల లోపు ఈ కెమెరాలను అమర్చడం జరుగుతుందన్నారు. వీటిని కంట్రోల్ రూమ్ కూడా లింక్ చేయడం జరుగుతుందన్నారు. ఇలాంటి ఏర్పాటు రాష్ట్రంలో ఎక్కడ కూడా ఉండదని, మొదట పుట్టపర్తిలో ఏర్పాటు జరుగుతుందన్నారు. పోలీసు కంట్రోల్ రూమును కూడా అన్ని రకాల ఆధునిక సాంకేతిక సౌకర్యాలతో సిద్ధం చేస్తున్నామన్నారు. నవంబర్ 25 వరకు ఈ సీసీ కెమెరాలు, డ్రోన్లు, 24/7 గంటలు పని చేసేలా నిరంతరం సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు. మున్ముందు కూడా వీటిని ఉపయోగిస్తామన్నారు.భద్రతాపరంగా ఏ చిన్న తప్పిదం కూడా జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు.శాంతి భద్రతల పరిరక్షించడంలో డ్రోన్లు సైతం తీసుకొస్తున్నామని, వీటిలో 2 నైట్ విజన్ డ్రోన్లను కూడా వినియోగిస్తున్నట్లు తెలిపారు. వీటిని రాష్ట్రంలో ఏ జిల్లాలో కూడా వినియోగించలేదని ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ డ్రోన్లు కోసం దాదాపు రూ. 5 లక్షల వెచ్చించి శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వారు ఇవ్వడం జరిగిందన్నారు. వీటి సహాయంతో ప్రముఖులు, భక్తులతో పాటు, పట్టణ ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. సాంకేతిక నిఘా విభాగాన్ని పటిష్టం చేసేందుకు సహకరించిన శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజంగ్ ట్రస్టీ రత్నాకర్, శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ గారికి ఎస్పీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ,**

నవంబర్ నెలలో జరిగే సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు దేశ విదేశీ భక్తులతో పాటు ప్రధాని, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు గవర్నర్లు , విఐపిలు రానున్న నేపథ్యంలో భద్రత దృష్ట్యా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. పుట్టపర్తి ప్రశాంతతను భద్రతను కాపాడేందుకు ఈ కెమెరాలు చాలా ఉపయోగ పడతాయని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, ట్రస్ట్ సభ్యులు , పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్, సిఐలు శివాంజనేయులు, గోపీనాథ్ రెడ్డి, ఎస్సై లింగన్న తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయి.

### కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్




**నెల్లూరు రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 12**
సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ గారిపై చెప్పుతో దాడి చేశారు. ఆయన ఒక దళితుడు కాబట్టే, ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. క్రితంలో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ లుగా పనిచేసిన వారిపై ఇలాంటి దాడులు జరిగిందా?ఈ దాడి జాతికి జరిగిన అవమానం. దళితులు కన్నీళ్ళతో బాధపడుతున్నారు.
తెలుగు వాడు, ఆంధ్రాకు చెందినవాడు దళితుడు, హర్యానాలో డిజిపి స్థాయి పోలీస్ అధికారిగా చేస్తున్నాడు. హర్యానా బిజెపి ప్రభుత్వంలో తనకు జరిగిన అవమానాన్ని తట్టుకోలేక తుపాకీతో కాల్చుకుని చనిపోయాడు. హర్యానా ప్రభుత్వం వేధింపులే కారణమని తొమ్మిది పేజీల నోట్ లో రాశాడు.బిజెపి, కూటమి ప్రభుత్వంలో దళిత ఆఫీసర్లకు గౌరవ, మర్యాదలు దక్కడం లేదు. దళిత ఉద్యోగస్తులు అవమానాలకు గురవుతున్నారు.
దళిత న్యాయమూర్తులు, దళిత పోలీస్ ఆఫీసర్లు, దళిత ఉద్యోగస్తులకే భద్రత లేకుంటే, ఇక సామాన్య దళితుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది.
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లాలో అంబేద్కర్ గారి విగ్రహాన్ని అట్ట పగలు, నిట్ట నిలువునా కాల్చేశారు.దళితులు కష్టాలతో, కన్నీళ్లతో, ఆకలితో, అవమానాలతో బతుకుతున్నారు.
కారంచేడు, చుండూరు వంటి ఘటనలు పునరావృతం అవుతోంది. చాలా బాధాకరం.
కాంగ్రెస్ పార్టీ తరఫున కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, దశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము. అంబేద్కర్ విగ్రహం వద్ద దళితుల పై దాడులకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సమీవుల్లా, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు

# కబ్జాదారులు కనిపించకుండా తరిమితరిమి కొడదాం

పరిటాల కుటుంబం దెబ్బకు 10 వేల కుటుంబాల్లో భయం -మా ఇల్లు నిలబడితే చాలని బిక్కుబిక్కుమంటున్నారు

పాపంపేటకు అండగా నిలబడతా..! -రాప్తాడు మాజి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి









**అనంతపురం రాప్తాడు, అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** ఎమ్మెల్యే పరిటాల సునిత అండతో కబ్జాదారులు పాపంపేట భూములపై పడ్డారని ప్రజలకు, కబ్జాదారులకు తాను అడ్డుగోడలా ఉంటాడని మాజి ఎమ్మెల్యే,తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హామి ఇచ్చారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం అనంతపురం రూరల్ మండలంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. అలాగే అనుబంధ సంఘాల కమిటీల నియామకం, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ 17 మెడికల్ కళాశాలలో జగనన్న తీసుకొస్తే.. చంద్రబాబు ఆ మెడికల్ కళాశాలలను బినామీలకు కట్టబెడుతున్నారన్నారు. అనంతరం 50 ఏళ్ల నుంచి నిర్మించుకున్న 20 ఇళ్లను పాపంపేటలో

పరిటాల సునిత కూల్చేసిందన్నారు. శోత్రియందారులతో జిపిఎ చేసుకున్న వారు ఈ స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తే ఐదేళ్ల పాటు మీ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అడ్డుకున్నాడు. హైకోర్టు అనంతపురం పట్టణంలోని సర్వే నంబరులో ఉన్న స్థలాన్ని స్వాధీనం చేయమని చెబితే...అధికారులు రూరల్ పరిధిలోని పాపంపేటలో ఉన్న స్థలాన్ని చూపిస్తున్నారంటూ అప్పటి కలెక్టర్ ద్వారా కోర్టుకు నివేదించామన్నారు.. తద్వారా ఆ ప్రక్రియ అంతటితో ఆగిపోయింది. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అనేవాడు అడ్డుగోడలా నిలబడ్డాడు కాబట్టే ఆరోజు ఇళ్లను కూల్చలేకపోయారు. ప్రకాష్‌రెడ్డి చేసిన మంచిని గుర్తించలేదన్నారు గత ఎన్నికల్లో ఓడించారు. పరిటాల సునీత వచ్చిన తొలిరోజు నుంచే ఆమె వెంటపడి కలెక్టర్‌తో తమకు అనుకూలంగా లేఖ రాయించి రాత్రికిరాత్రి ఆ ఇళ్లను కూల్చేయించారు. మళ్లీ నేనే హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చా. ఆరోజు ఈరోజు రెండుసార్లూ కబ్జాదారులు, పాపంపేట ప్రజల మధ్య అడ్డుగోడలా నిలిచానన్నారు. రాచూరి బంధువులతో పరిటాల సునిత బంధువులు జిపిఎ చేయించుకుని పాపంపేట పొలంలో ఎక్కడా ఖాళీ స్థలాలుంటే ఆక్కడ వాలిపోతున్నారు. 2017లోనూ విద్యారణ్యనగర్‌లో నివాసాలు ఉంటున్న వారితో పరిటాల కుటుంబ సభ్యులు 7 కోట్లు వసూళ్లు చేశారు. రక్తం తాగేందుకు అలవాటుపడ్డ పులిలా ఈజీగా డబ్బుల సంపాదనకు అలవాటుపడ్డ పరిటాల కుటుంబం ఈరోజు రాచూరి కుటుంబాన్ని అడ్డుపెట్టుకుని మళ్లీ ప్రజల ఆస్తులపై పడుతున్నారన్నారు. వారిదెబ్బకు 10 వేల కుటుంబాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. వీరి దెబ్బకు ప్రజలు అభివృద్ధి అడగడం లేదు. మా ఇల్లు నిలబడితే చాలు అని బిక్కుబిక్కుమంటున్నారు. పాపంపేటకు అండగా నిలబడతా నాతోపాటు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకుంటా. పాపంపేటలో ఏ ఒక్క ఇంటిలోకి తెలుగుదేశం పార్టి వాళ్లు రావాలన్నా అది ప్రకాష్ రెడ్డిని దాటుకునే రావాలి. దీనికోసం ప్రతి వీధిలోనూ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు.. ప్రతి వీధిలోనూ ఇద్దరి పేర్లు ఉంటేచాలు. కబ్జాదారులు పాపంపేట వీధుల్లో కనిపించకుండా తరిమితరిమి కొడదాం. 10 వేల కుటుంబాలను రోడ్డుకు ఈడ్చిన, 50 వేల నిరుపేదల సొంతిటి కలను అడ్డుకున్న పరిటాల సునితకు ఎమ్మెల్యే గా కొనసాగే అర్హత లేదన్నారు.

# అధికారం కోసమే కొత్త నాటకాలు!

## -వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన ఎమ్మెల్యే బాలకృష్ణ

**మళ్లీ అధికారం కోసమే వారి పనికిమాలిన ప్రసంగాలు అంటూ విమర్శ**

**గత ప్రభుత్వ హయాంలో హిందూపురం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపణ**

**వైద్య కళాశాలల అభివృద్ధిని వైసీపీ పట్టించుకోలేదని ధ్వజం**

**తుమ్మలకుంటలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన బాలయ్య**



అమరావతి,**అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** వైసీపీ నేతలు మళ్లీ అధికారంలోకి రావాలనే ఆశతో పనికిమాలిన ప్రసంగాలు చేస్తున్నారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తీవ్రస్థాయిలో విమర్శించారు. గడిచిన ఐదేళ్లలో ఏమాత్రం అభివృద్ధి చేయని వారు, ఇప్పుడు కొత్తగా పీపీపీ మోడల్ పై నాటకాలు ఆడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం తుమ్మలకుంట గ్రామంలో పర్యటించిన ఆయన, అర్హులైన వారికి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బాలకృష్ణ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో హిందూపురం నియోజకవర్గం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. "వైసీపీ నేతలు కేవలం అధికారంపై యావతోనే ఉన్నారు. అప్పట్లో వైద్య కళాశాలల అభివృద్ధికి వారు చేసిందేమీ లేదు. ఇప్పుడు మాత్రం అధికారంలోకి రావాలనే ఉబలాటంతో ఏవేవో ఊహించుకుంటూ మాట్లాడుతున్నారు" అని బాలకృష్ణ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధిని, ముఖ్యంగా వైద్య విద్యా సంస్థలను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆయన ఆరోపించారు. తన లక్ష్యం హిందూపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమేనని బాలకృష్ణ స్పష్టం చేశారు. ఆ దిశగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముందు గ్రామానికి చేరుకున్న బాలకృష్ణకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఈ పర్యటనలో పలువురు స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# జగన్ వస్తున్నారని తెలిసి ఆ హామీ ఇచ్చారు: రోజా



అమరావతి,**అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు మామిడి రైతులను దారుణంగా మోసం చేశారని వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతులకు చెల్లించాల్సిన సుమారు రూ. 540 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. సొంత జిల్లా మామిడి రైతులకు బాబు మార్కు మోసం అంటూ విమర్శనాస్త్రాలు సంధించారు. "మోసానికి మారుపేరు చంద్రబాబు! నమ్మిన వారినే మోసం చేయడం ఆయన ప్రత్యేకత. ఎన్నికల్లో ఓట్ల కోసం హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి, నమ్మి ఓటేసిన ప్రజలను మోసం చేశారు. ఇచ్చిన హామీల గురించి అడిగితే 'నాలుక మందం' అంటున్నారు. ఇప్పుడు సొంత జిల్లా చిత్తూరు మామిడి రైతులకూ చంద్రబాబు తనదైన శైలిలో మోసం చేస్తున్నారు. మా పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గారు చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో మామిడి రైతుల సమస్యలపై పర్యటించి, వారికి గిట్టుబాటు ధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. జగనన్న బంగారుపాళ్యానికి రానున్నారన్న సమాచారం తెలిసి, రైతులను తప్పుదోవ పట్టించేందుకు చంద్రబాబు కొత్త నాటకం ఆడారు. తోతాపురి మామిడి కిలోకు ఫ్యాక్టరీలు రూ.8, ప్రభుత్వం రూ.4 చొప్పున మొత్తం రూ.12 ఇస్తామని హామీ ఇచ్చి, మామిడి రైతుల సమస్య పరిష్కారమైందని అబద్ధ ప్రచారం చేశారు.

# ఉపాధి హామీ పథకం పారదర్శకంగా జరగాలి

## -భారతీయ అంబేద్కర్ సేన నాయకులు,



**బైరెడ్డిపల్లి అక్టోబర్ 12 రిపబ్లిక్ న్యూస్!** బైరెడ్డిపల్లి మండలం కడపనతం గ్రామంలో ఏపీఓ హరినాథ్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ జాబ్ కార్డు ఆధార్ అనుసందానంలో భాగంగా కడపనత్తం గ్రామంలో జరిగిన సర్వేలో పాల్గొన్న టీడీపీ యువ నాయకుడు రఘుపతి,మరియు భారతీయ అంబేద్కర్ సేన నాయకులు కుమార్,ప్రవీణ్,మరియు రమణ , ఉపాధి హామీలో అవకతవకలు జరగకుండా బయో మెట్రిక్ ద్వారా ఆధార్తో అనుసంధానించడం వల్ల ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఎలాంటి అవకతవకలు జరగవని భారతీయ అంబేద్కర్ సేన చిత్తూరు జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తెలియజేశారు, ఉపాధి హామీ పథకం ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని తెలియజేశారు,ప్రతి ఒక్కరు తమ హక్కులను తెలుసుకోవాలని,తమకు కావలసిన ఎమర్జెన్సీ మెడికల్ కిట్ మరియు త్రాగునీరు,అడిగి తీసుకోవాలని ఎప్పటికప్పుడు,ఉపాధిహామీ పర్యవేక్షకుని ఆధ్వర్యంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# ఈ నెల 16న కర్నూలు జిల్లా రాగ మయూరి లో జరగబోయే నరేంద్ర మోదీ బహిరంగ సభ పరిశీలిస్తున్న టిడిపిపార్టీ రాష్ట్ర అధ్యక్షులుపల్లె శ్రీనివాస్ రావు







**ఓర్వకల్ ప్రతినిధి, అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్)** ఆదివారం,ఈ సందర్భంగా పార్టీ జిల్లాసమన్వయ కమిటీ సభ్యులు,స్థానిక నేతలతో కలిసి రాష్ట్ర అధ్యక్షుడిని ఘనంగా ఆహ్వానించిన ఎమ్మెల్సీ బీ.టి.నాయుడు అనంతరం వారు సభా ప్రాంగణానికి చేరుకొని ఏర్పాట్లను సమీక్షించారు. వేదిక నిర్మాణం, భద్రతా ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలపై అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు..రాబోయే మోది సభను ఘనవిజయవంతం చేయాలనే సంకల్పంతో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా సిద్ధమవుతున్నాయని నాయకులు తెలిపారు. జి నాగమణని పాల్గొన్నారు

# టిడిపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా.శ్రీనివాసరావు కు ఘనంగా సన్మానం చేసిన ఏపీ ఈడబ్ల్యూడీసీ డైరెక్టర్ జి.నాగముని





**ఓర్వకల్ ప్రతిని, అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్)** ఆదివారం నాడు, కర్నూలు పట్టణంలోని, స్టేట్ గెస్ట్ హౌస్ లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు-పల్లా.శ్రీనివాసరావుకు ఏపీ ఈడబ్ల్యుఐడీసీ డైరెక్టర్ జి.నాగముని శాలువా కప్పి, స్వాగతం పలికి, ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కర్నూలు కుడా చైర్మన్-సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# డీఎస్పీ ఆఫీసు ముందు దంపతుల ఆత్మహత్యాయత్నం

## కేసు నమోదు చేసిన టూటౌన్ సి.ఐ శ్రీకాంత్



**అనంతపురం: క్రైమ్, అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లికి చెందిన గుడ్డెప్ప గారి అశోక్ స్వయాన అతని మామ గాలి ఆంజనేయులు ( భార్య తండ్రి) కు సుమారు మూడు సం,,రాల క్రితం రూ.18 లక్షలు రూపాయలు అప్పుగా ఇచ్చాడు. కంబదూరు మండలం ఐపార్లపల్లికి చెందిన భం భం స్వామి అలియాస్ రామ కృష్ణ స్వామి మధ్యవర్తిగా ఉన్నాడు. అయితే...అశోక్ మామ గాలి ఆంజనేయులు ప్రస్తుతం చనిపోయాడు. అతని భార్య లక్ష్మీ దేవి అనంతపురంలోని రుద్రం పేట ఏరియాలో నివాసం ఉంటోంది. అప్పు ఇచ్చిన డబ్బులు కోసం అత్త వద్దకు వెళ్ళి తిరిగి ఇవ్వమని అడిగాడు. అక్కడ డబ్బులు ఇవ్వలేదు. న్యాయం జరగలేదని అనంతపురం డీఎస్పీ ఆఫీసు ముందర వచ్చి రోడ్ కు అడ్డంగా కూర్చొని పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు. ఈ విధంగా వారి స్వప్రయోజనాల కోసం రోడ్ కు అడ్డంగా కూర్చొని పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నము చేసిన ఇద్దరి దంపతుల పై చట్టప్రకారం టూ టౌన్ సీఐ శ్రీకాంత్ కేసు నమోదు చేశారు. ఎవరైనా కానీ వారి స్వప్రయోజనాల కోసం ఇలా చేయడం చట్టవిరుద్ధం.ఏదైనా పోలీస్ స్టేషన్ ద్వారా గాని కోర్టు ద్వారా గానీ చట్ట పరిధిలో సమస్యను పరిష్కారం చేసుకోవాలని అనంతపురం టూటౌన్ సి.ఐ తెలిపారు.

# జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై విజయం సాధించిన సంకీర్తనను ఘనంగా

## సన్మానించిన రేగుంట ఆల్ యూత్ అసోసియేషన్,స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు



**మల్లాపూర్ అక్టోబర్ 13 (రిపబ్లిక్ న్యూస్)** స్కూల్ లెవెల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి విజయం సాధించిన విద్యార్థిని కొత్తపల్లి సంకీర్తనను మెమోంటో అందించి,శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించిన రేగుంట ఆల్ యూత్ అసోసియేషన్ %ఁ% స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు ...ఈ సందర్భంగా రేగుంట ఆల్ యూత్ అసోసియేషన్ స్పోర్ట్స్ అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్, క్లబ్ సభ్యులు మాట్లాడుతూ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై విజయం సాధించి రేగుంట గ్రామానికి , జిల్లా విద్యార్థినిలకు ఆదర్శంగా నిలువడం అభినందనీయమని అన్నారు..మహిళా విద్యార్థినీలు సంకీర్తనను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలని అన్నారు..క్రీడలపై మక్కువను గుర్తించి సంకీర్తనను ప్రోత్సాహిస్తున్న వారి తండ్రి అశోక్ కు అభినందనలు తెలిపి..భవిష్యత్లో సంకీర్తనకు క్రీడల పరంగా సహకారం అందించి అండగా నిలబడటానికి రేగుంట ఆల్ యూత్ అసోసియేషన్ %ఁ% స్పోర్ట్స్ క్లబ్ సభ్యులం ముందుంటామని తెలిపారు..ఈ కార్యక్రమంలో... రేగుంట ఆల్ యూత్ అసోసియేషన్ %ఁ% స్పోర్ట్స్ క్లబ్ కార్యవర్గ,క్లబ్ సభ్యులు,చెన్నూరి రమేష్,కుక్కుదుగు అశోక్, బైర రాజ్ కుమార్,నల్ల వినోద్, ఎనగందుల నవీన్,తీట్ల రాజేష్, బైర రాకేష్, మామిడి నరహరి, మాట్ల విజయ్, సుతారి సాయి,వేములవాడ రామ్, నల్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ ఆలయ దర్శనం నిలిపివేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం



**కోరుట్ల టౌన్, అక్టోబర్ 12 (రిపబ్లిక్ న్యూస్)** వేములవాడ ఆలయ దర్శనం నిలిపివేయడాన్ని నిరసిస్తూ కథలాపూర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ భక్తుల మనోభావాలు దెబ్బతిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్యాల మారుతి, జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వర్ రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కోడిపెల్లి గోపాల్ రెడ్డి, బండ అంజయ్య, కథలాపూర్ మహేష్, నరెడ్ల రవి, కాసోజీ ప్రతాప్, కంటే రాజం, ఆరే శివ, మరిపెల్లి గణేష్, కల్లెడ ప్రసాద్, రాజేష్, సునీల్, లింగమూర్తి, సాయిరెడ్డి, ప్రవీణ్, సాయి, సునీల్, శ్రీను, అనీల్, ప్రమోద్, రాజేష్, మహేష్ పాల్గొన్నారు.

# నిర్దేశిత వైద్య సేవలు ప్రజలకు సకాలంలో అందించాలి

## కొల్చారం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ -కలెక్టర్ రాహుల్ రాజ్





**మెదక్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12( రిపబ్లిక్ న్యూస్)** నిర్దేశిత వైద్య సేవలు సకాలంలో ప్రజలకు అందించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్యాధికారులను ఆదేశించారు. కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపి రిజిస్టర్, సిబ్బంది హాజర పట్టిక , మందుల స్టాక్ రిజిస్టర్ఆసుపత్రి పరిసరాలు పరిశీలించి వైద్యాధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధుల కేసులు, వాటికి సంబంధించిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.దవాఖానలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా. సీజనల్ వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా అవసరమైన చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఎల్లవేళలా వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు విశేష కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# నేటి నుంచి ఈనెల 15 వరకు పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్

**మల్లాపూర్ అక్టోబర్ 13 ( రిపబ్లిక్ న్యూస్ )** దేశవ్యాప్తంగా 290 జిల్లాల్లో పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్ 0-5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు.ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో డ్రైవ్ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర ప్రముఖ ప్రదేశాలతో పాటు ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయనున్న వైద్య సిబ్బంది.

# విశ్వకర్మలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలి

## అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ సమావేశంలో వక్తలు -విశ్వకర్మల మండల కమిటీ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



**కోరుట్ల టౌన్, అక్టోబర్ 12 (రిపబ్లిక్ న్యూస్)?** విశ్వకర్మలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలని అఖిల భారతీయ విశ్వకర్మ మండల కమిటీ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం జగిత్యాల జిల్లా అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ సమావేశం కోరుట్ల పట్టణంలో జరిగింది. జగిత్యాల జిల్లా అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ కోరుట్ల మండల అధ్యక్షులుగా వనతడుపుల రమణాచారి, మండల ప్రధాన కార్యదర్శిగా మండలోజు పవన్ కుమార్, కోశాధికారిగా మద్దెలపల్లి భూమయ్య, గౌరవ అధ్యక్షులుగా విశ్వనాథుల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వనతడుపుల నాగరాజు, న్యాయ సలహాదారులుగా వనతడుపుల అరుణ్ కుమార్ చారి, కోరుట్ల మండల గ్రామాల అధ్యక్షులను సలహాదారులుగా, కార్యవర్గ సభ్యులుగా ఎలక్షన్ అధికారి, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి సంకోజు లక్ష్మీనారాయణ సమక్షంలో కార్యవర్గంను నియమించారు. నియామకం అయిన వారికి అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు శివపల్లి రాజేశం అనుమతితో జిల్లా ఉపాధ్యక్షుడిగా అధ్యక్షులు చింతల రాజేశ్వర్ నియామక పత్రాలు అందించారు. అలాగే విశ్వకర్మీయుల పునర్వైభవానికై రాజకీయ భాగస్వామ్యం అవసరమని, అందులో భాగంగా కోరుట్ల అసెంబ్లీ నియోజక కన్వీనర్ గా వెల్ది శ్రీకాంత్ చారిని నియమించారు. అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ లక్ష్యాలైన కలప ఇనుము ఆధారిత పరిశ్రమల అభివృద్ధి సంక్షేమం కోసం "వుడ్ అండ్ ఐరన్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్" ఏర్పాటు, రైతులకే వెన్నెముకగా వేల సంవత్సరాలుగా సేవలందిస్తున్న గ్రామీణ ప్రాంతాల విశ్వకర్మీయ కమ్మర, వడ్రంగి కుటీర పరిశ్రమల వారికి రైతులకు ఇచ్చిన విధంగా ఉచిత విద్యుత్ సరఫరా చేయాలనే డిమాండ్ సాధనకు కృషి చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. విశ్వకర్మీయ పునర్వైభవ సాధనకు రాష్ట్ర జిల్లా కమిటీలు చేసే ప్రతి కార్యక్రమానికి చేదోడువాదోడుగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు శ్రీ రాముల వేణుగోపాల చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల నరేష్, ఉపాధ్యక్షులు పొన్నగంటి రంజిత్, యూత్ కన్వీనర్ కోరుకంటి సాయి కృష్ణ, ముఖ్య సలహాదారులు కొత్తపల్లి రఘు, మల్లాపూర్, మండల ప్రధాన కార్యదర్శి కూసనపల్లి రజనీకాంత్, కోరుట్ల వీరబ్రహ్మేంద్ర కార్పెంటర్స్ ఆర్గనైజేషన్ కోశాధికారి ఎదులాపురం లక్ష్మీనారాయణ గౌరవాధ్యక్షులు ఇంద్రాల మల్లేశం, సలహాదారులు శ్రీ గద్దె చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు, విశ్వకర్మ కుల బంధువులు పాల్గొని వారిని అభినందించారు.

## అట్రాసిటీ చట్టం ఆదివాసి దళితులకు ఒక వరం కానీ

# ఏనాటికి ఆయుధంగా వాడొద్దు....

## -ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్ కురుసెంగ వేణు



**రాయికల్ పట్టణం, అక్టోబర్ 12, ( రిపబ్లిక్ న్యూస్)** ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ విచారణ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మెంబర్ కురుసెంగా వేణు గారు విచారణ లో భాగంగా మాట్లాడుతూ అట్రాసిటీ చట్టం ఆదివాసి దళితులకు ఒక వరం కానీ ఏనాటికి ఆయుధంగా వాడొద్దు.. వందమంది దోషులు తప్పించుకోవచ్చు కానీ ఒక నిర్దోషికి శిక్ష పడకూడదని చట్టం చెబుతుంది. అలాంటి చట్టాలను దుర్వినియోగం చేయవద్దని అనవసరంగా ఎస్టిఎసి అట్రాసిటీ చట్టాలని వాడవద్దని ఈ సందర్భంగా కురుసెంగ వేణు అన్నారు. ఇంద్ర నగర్ కాలనీలో సందెల దుర్గా పై వేసిన కేసు విచారణలో ఈ రోజు పాల్గొని నిజ నిర్ధారణ నిర్దేశించే పనిలో భాగంగా ఈ సందర్భంగా మాట్లాడుతూ అవగాహన లేక కొందరు, అనవసరంగా అట్రాసిటీ చట్టాన్ని... ఇష్టం వచ్చినట్టు వాడుతున్నారని, అధికారులు కూడా ఆలోచించకుండా అనవసరంగా కేసులు నమోదు చేయకూడదని.. పూర్తిస్థాయిలో విచారణ జరిపించిన అనంతరం ఇట్టి కేసుల్లో పురోగతి సాధించే విధంగా ఉండాలని అన్నారు ఆదివాసీ దళితులకు పూర్తిగా అవగాహన కల్పించే కార్యక్రమాలు కూడా తీసుకోవాలని మరియు ఇలాంటి కేసులు అనవసరంగా పెట్టినట్టు అయితే నిజమైన కేసుల్లో సమాజం కుడా నమ్మకం లేకుండా పోతుందని... భూముల కొట్లాటలో మరియు పాలిపగల కొట్లాటాల్లో పాత కేసుల విచారణలో వాటిని ఆధారంగా చేసుకుని ఇలాంటి కేసులు ఇకపై పెట్టకూడదని అమాయకుల్ని బలి చేయకూడదని కులం పేరుతో దూషించిన వారిని ఎవరిని విడిచిపెట్టద్దని ఐపీసీ సెక్షన్లు పెట్టాల్సిన సమయంలో బిన్ స్ బుక్ చేస్తున్నారని ఆర్ స్ సెక్షన్ కాకుండా పిఏ లా కూడా విచారణ జరిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఆత్రం రవీందర్ ఆదివాసి తోటి రాష్ట్ర నాయకులు మరియు ఆదివాసి జిల్లా తోటి సంక్షేమ సేవా సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కూరుసెంగ ప్రసన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

# మార్వాడిగా యువ మంచ్ ఆధ్వర్యంలో వాక్ థాన్

## పాల్గొన్న మార్వాడీ యువమంచ్ సభ్యులు, చిన్నారులు










**తాండూరు, అక్టోబర్ 12 (రిపబ్లిక్ న్యూస్)** రోజుకు ఒక గంట పాటు నడుస్తే మనిషి ఆరోగ్యంగా మెరుగు పడుతుందని తాండూరు మార్వాడి యువమంచ్ మంచ్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం తాండూరు శాఖ ఆధ్వర్యంలో వాక్ థాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ను మంచ్ వ్యవస్థాపకులు విజయ ప్రకాష్ సార్దా జెండా ఊపి నడక ర్యాలీని ప్రారంభించారు.పట్టణంలోని మార్వాడి బజార్ నుంచి వివిధ పుర వీధుల గుండా వాక్ థాన్ కొనసాగింది. ఈ ర్యాలీలో చిన్నారులు, మంచ్ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నడక ప్రాముఖ్యతను వివరిస్తూ సాగారు. అనంతరం మార్వాడి యువమంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు మన్మోహన్ సార్దా, పలువురు సభ్యులు మాట్లాడుతూ ... రోజుకు కనీసం ఒక గంట పాటు నడవాలి అని అన్నారు. నడక వల్ల ఆరోగ్యానికి ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజూ సెల్ ఫోన్ కు ఓ గంట చార్జింగ్ ఎలా పెడతారో ఆలాగే మనం కూడా గంట నడవాలి అని అన్నారు.దీని వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచ్ అధ్యక్షులు అనిల్ సార్దా, కార్యదర్శి సచిన్ రాఠి, కోశాధికారి అరుణ్ సార్దా, జాతీయ కార్యదర్శి రోహిత్ అగ్రవాల్, మాజీ అధ్యక్షులు సూర్య ప్రకాష్ సోమాని, కార్యక్రమ చైర్మన్ లు దీనేష్ పర్తానీ, బ్రిజ్ మోహన్ బూబ్, రాజ్ గోపాల్ గగ్రాని, మంచ్ సభ్యులు నితిన్ సోమాని, ఆశిష్ సార్దా, రాకేష్ బూబ్, మధు సోని, ముఖేష్ సోమాని, కిషన్ రాఠి. రోహిత్ సోని, నిహార్ సోమాని, లక్ష్మీ నారాయణ్ బూబ్, తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ దేవస్థానానికి అధిక సంఖ్యలో భక్తుల రాక







**అక్టోబర్12( రిపబ్లిక్ న్యూస్) ఆందోల్** ఆదివారం కావడంతో నల్ల పోచమ్మ దేవస్థానానికి మెదక్ జిల్లాలో రెండవ అతిపెద్ద గుడిగ ప్రసిద్ధి చెందిన నల్ల పోచమ్మ దేవస్థానానికి దసరా సెలవులు ఈరోజుతో ముగుస్తున్న సందర్భంగా చిన్నపెద్దలతో భక్తి శ్రద్దలతో అమ్మవారి యొక్క దీవెనలు చల్లగా మాపై ఉండాలని బోనాలు సమర్పిస్తూ ఒడిబియాలు పోస్తు పిల్లాపాపలపై వచ్చినటువంటి భక్తులందరిపై అమ్మవారి దీవెనలు చల్లగా ఉంచి వారి కుటుంబంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని అందర్నీ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉంచి అందర్నీ వేడుకోవడం జరిగింది ఆశీర్వదించి దీవెనలు ఉండేలా వచ్చినటువంటి భక్తులందరూ వేడుకోవడం జరిగింది

# బోయకొండపై కిటకిటలాడిన భక్తులు

**చౌడేపల్లి అక్టోబర్ 12 రిపబ్లిక్ న్యూస్**





శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది కొండ దినం కావడంతో ఉదయాన్నే అమ్మవారికి అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో విశేషాలు అలంకరణ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి క్యూ లైన్ లన్నీ భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ల వద్ద ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం భక్తులకు మౌలిక వసతులు కల్పించారు దగ్గరుండి క్యూ లైన్ లో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పర్యవేక్షించారు. ఆలయ అధికారచక సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

**బోయకొండ గంగమ్మ ఆలయానికి రూ 25వేలు విరాళం**

శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మ ఆలయానికి దాత రూ. 25 వేలను విరాళంగా అందించారు కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన కృష్ణవేణి ఆదివారం ఆలయంలో ఈవో ఉప కమిషనర్ ఏకాంబరంకు నగదును విరాళంగా అందించారు.అనంతరం అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు.

# ఊటూరులో వృధా అవుతున్న తాగునీరు



**చౌడేపల్లి అక్టోబర్ 12 రిపబ్లిక్ న్యూస్** మండలంలోని పెద్ద ఎల్లకుంట్ల పంచాయతీ ఊటూరులో తాగునీరు వృధా అవుతున్న ఎవరూ పట్టించుకోలేదు. చౌడేపల్లి బోయకొండ ప్రధాన రహదారిలో ఊటూరు గ్రామం ఉంది రహదారికి పక్కనే ఓ కొళాయి నుంచి నీరు వృధాగా పోతున్నప్పటికీ అధికారులు గ్రామస్తులు పట్టించుకోకపోవడం గమనార్హం. నీరంతా రోడ్డుపై వృధాగా ప్రవహిస్తున్నాయి, ఇకనైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని ఊటూరు గ్రామంలో మంచినీటిని సరఫరా చేసే కొళాయిలను మరమ్మత్తు చేయించాలని పలువురు కోరుతున్నారు.

# రాయికల్ పట్టణానికి రాత్రిపూట బస్సులు కావాలి

## గతంలో నడిచిన కొత్తపేట నైట్ హాల్ట్ బస్సు తిరిగి పునరుద్ధరించాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డిని

## ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను ఎంపీ ధర్మపురి అరవింద్ ను రాయికల్ మండల ప్రజానీకం విజ్ఞప్తి

**రాయికల్ పట్టణం,అక్టోబర్ 12, ( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి రాత్రిపూట బస్సు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

గతంలో కరోనా నుండి రాత్రిపూట బస్సు బిఆర్ఎస్ ప్రభుత్వం బంద్ చేసింది అప్పటినుండి అరు నెల్ల క్రితం దాకా బస్సు బంద్ చేసినా అప్పటి జిల్లా కలెక్టర్ యశ్విన్ భాష ఆదేశాలతో ఆర్టీసీ అధికారులను పట్టుబట్టి మాకు తప్పనిసరిగా బస్ కావాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి చోరువతో అయన ఆధ్వర్యంలో జగిత్యాల్ అల్లిపూర్ రాయికల్ రామాజీపేట భూపతిపూర్ ముట పెల్లి కొత్తపేట వరకు రాత్రిపూట జగిత్యాలలో 9: 30కు బయలుదేరి అల్లిపుర్ రాయికల్ భూపతిపూర్ మూట పెల్లి కొత్తపేటకు పదకొండు గంటల 30 నిమిషాల వరకు చేరుకుంటున్నాది అట్టి భాస్సు పొద్దున 5: 00 కొత్తపేటలో ప్రారంభమై మూట పెల్లి రామాజీపేట్ రాయికల్ చూసుకుంటూ అల్లిపూర్ ద్వారా జగిత్యాల చేరుకుంటుంది అట్టి బస్సును మొన్నటి వర్షాలకు మూట పెల్లి కొత్తపేట్ మధ్యలో బ్రిడ్జి తెగిపోవడంతో అట్టి బస్సును అర్టీసీ వారు బంద్ చేశారు కొత్తపేట జగిత్యాల్ బస్సు అనేది ప్రైవేట్ సర్వీస్ నైట్ హాల్ట్ చేయమంటే వారు చెయ్యము అంటే ప్రత్యేకంగా జీవన్ రెడ్డి చొరవ తీసుకొని అట్టి బస్సును ప్రారంభింపా చేసారు అతనికి మండల ప్రజలు ధన్యవాదములు తెలిపారు

మధ్యలో ప్రైవేట్ బస్సు వాళ్ళు రాత్రిపూట మేము నడిపించమని వెళ్లిపోతే డిపో మేనేజర్ ప్రభుత్వ బస్సును మంచిర్యాల్ చూసుకొని లక్షట్ పెట్ ధర్మపురి జగిత్యాల్ వచ్చి తొమ్మిది 30 నిమిషాలకు బయలుదేరి అల్లిపూర్ రాయికల్ రామాజీపేట్ భూపతిపూర్ మూట పెల్లి కొత్తపేట్ రాత్రి 11: 30 కు చేరుకుంటుంది తిరిగి ప్రొద్దున 5 గంటలకు బయలుదేరి కొత్తపెట ముతా పెల్లి రామోజీపేట్ రాయికల్ అల్లిపూర్ జగిత్యాల చేరుకుంటుంది

మొన్ని మధ్యలో రాత్రి జగిత్యాల్ లొ బయలుదేరి అల్లిపూర్ లో యాక్సిడెంట్ కావడంతో అట్టి బస్సు రాయికల్ పోలీస్ స్టేషన్లో డ్రైవర్ పై కేసు పెట్టి అట్టి బస్సును 3 రోజులు ఉంచరు చివరికి బస్సు రాత్రిపూట రావడం బంద్ అయింది ఎవరికి చెప్పాలి అని తర్జనభర్జన అవుతున్న ప్రజానీకం ఏమి చేయలేక ఆటోలను ఆశ్రయిస్తున్నారు.



చివరి బస్సు జగిత్యాల నుండి 7 30 నిమిషాలకు చివరిది కాబట్టి చదువుకున్న మేధావులు విద్యార్థులు ప్రజలు ఏమి చేయలేక ప్రవేట్ ఆటోలోనూ ఒక్క మనిషికి 500 చొప్పున రాత్రి పూటలా ఇక్కడ చేరుకుంటున్నారు దీని కొరకై ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఎన్నో మార్లు చెప్పడం జరిగింది ఫలితం శూన్యం

ఈ విషయమై జగిత్యాల డిపో మేనేజర్ కల్పన మేడంను బస్సు వేయమని అడగగా దసరా తర్వాత రాయికల్ వరకునైట్ హాల్ట్ బస్సులు నాడుపుతమని తెలిపారు ఇప్పటికి పది రోజులు అయిపోయింది దసరా ఇప్పటి వరకు మాత్రం రాత్రిపూట బస్సు లేదు ఏది ఏమైనా మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఈ విషయంలో చొరవ తీసుకొని రాయికల్ కొత్తపేట బస్సును ప్రారంభించాలని రాయికల్ మండల ప్రజానీకం కోరుతున్నారు జగిత్యాల్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కూడా బస్స్ కొరకు పూర్తి ప్రయత్నం చేయాలని బస్సు కావాలని రాయికల్ మండల యువత ఇద్దరి నాయకులను మాజీ మంత్రి జీవన్రెడ్డిని ఎం ల్ ఎ సంజయ్ కుమార్ ను జగిత్యాల డిపో మేనేజర్ కల్పనామేడం ను బస్సు కావాలని రాత్రి నైట్ హాల్ట్ బస్సు తప్పనిసరిగా కావాలని పట్టణ యువత మండల యువత కోరుతున్నారు

ఇందులో ముఖ్య విషయం ఏందంటే జగిత్యాల డిపో మేనేజర్ కల్పన మేడం మాటల్లో కొత్తపెట్ రూట్ లో రాత్రి ఆరుగురు ఏడుగురు బస్సు ఎక్కుతున్నారని అలా చేస్తే నష్టం కదా అని ఆమె అనడంతో మరి ప్రొద్దునా బోర్నా పెల్లి బస్సు రాయికల్ ద్వారా జగిత్యాల పోతున్న ఆ బస్సులొ 160 మంది ఎక్కుతున్నారు అలాగే రాయికల్ సెటిల్ 140 మంది జగిత్యాల వరకు వెళ్తున్నారు

మరి కేవలం బస్సులో మాత్రం 55 నుండి 60 లోపు మాత్రమే బస్ కెపాసిటీ కదా అని వాళ్ళు అ%శీ%తమంది ఎక్కడము మరి ఆర్టీసీకి లాభమే కదా మరి ఆ విషయం ఎందుకు చెప్పడం లేదుఅని కల్పనా మేడంను రాయికల్ యూత్ ప్రశ్నిస్తున్నారు రాయికల్ రూటు లొ నిర్మల్ ఉండి జగిత్యాల వరకు పది బస్సులు ఉండగా ప్రతి బస్సు రాయికల్ నుండి 120 ప్రయాణికులతో నడుస్తున్నాయి అదికాక రెండు రాయికల్ షటిల్ బస్సులు కొత్తపేటబస్సు బోర్లపెల్లి బస్సులు పూర్తి కేపాసిటి మించి పోతున్నారు అది మీ అర్టీసీ కి లాభం కదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా రాత్రిపూట 9: 30 కు చివరి బస్సు కావాలని రాయికల్ ప్రజలు ఆర్టీసీ రిజినాల్ మేనేజర్ కరీంనగర్ ను జగిత్యాల డిపో మేనేజర్ కల్పనాలను ప్రజా ప్రతినిధులైన నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాజీ మంత్రి జీవన్ రెడ్డిలను నైట్ హాల్ట్ బస్సు కావాలి అని రాయికల్ మండల ప్రజలు కొరుతున్నరు

# రాయికల్ మండలానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా8 లక్షల 50 వేల రూపాయల చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పంపిణీ





**రాయికల్ పట్టణం, అక్టోబర్ 12, ( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల్ జిల్లా రాయికల్ లక్ష్మి గార్డెన్స్ లో రాయికల్ మండలానికి చెందిన 35 మంది లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 8 లక్షల 50వేల రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని నిరుపేదలకు ఆర్థిక సాయం ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో మేలు అని ఈ సందర్భంగా సంజయ్ కుమార్ అన్నారు

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు, పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ గన్నె రాజిరెడ్డి రాయికల్ మున్సిపాలిటీ కొప్షన్ మాజీ నెంబర్ డాక్టర్ పిప్పోజీ మహేందర్ బాబు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్ రావుబోర్నాపెల్లి కోల శ్రీనివాస్,అచ్యుత రావు, ఉప్పు మడిగే ముత్తయ్య గౌడ్ రాయికల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జోగిన్ పేల్లి తిరుపతి గౌడ్ బిట్ల నరసయ్యలాయర్ చర్ల కొండాపూర్ మాజీ సర్పంచ్ సుదర్శన్ కిష్టం పేట సిరుపురము సత్తాయ్య తాజా మాజీ కౌన్సిలర్ లు,సర్పంచ్ లు, ఎంపిటిసి లు,పట్టణ మండల నాయకులు,యూత్ నాయకులు,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం

**సంగారెడ్డి జిల్లా స్టాపర్, అక్టోబర్ 13 ప్రజా రిపబ్లిక్ న్యూస్**





కల్హేర్ మండలంలోని మా సా న్ పల్లి గ్రామాల్లో ఆదివారం పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశావర్కర్లు ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఐదేళ్లలోపు చిన్నారులకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈరోజు డ్రాప్స్ వేయించలేని వారు రేపు, ఎల్లుండి డోర్ టు డోర్ పర్యవేక్షించనున్న సిబ్బంది చుక్కల మందు వేస్తారని, వారికి సహకరించాలని కోరారు. సిబ్బంది ఉన్నారు. పోలియో రహిత భారతదేశానికి అందరూ సహకరించాలని కోరారు.

# కుప్పంలో ఆదివారపు ఆరాధన

## హెూసన్నా మందిర్ టీవీఎస్ షోరూం పైన భారీగా తరలివచ్చిన విశ్వాసులు





**కుప్పం రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 12**




ప్రభుత్వ హాస్పిటల్ నుండి విజలాపురం బైపాస్ రోడ్డు కుప్పం లో జరిగిన హెూసన్నా మినిస్ట్రీ ఆరాధనలో అనేకమంది అత్యుత్సాహంతో పాల్గొనగా ఈ యొక్క హెూసన్న మందిర్ ప్రార్థనకు అనేకమంది అనేక రకాలుగా హెూసన్న మందిర్ ఆదివారం ఆరాధనను జరగకుండా ఎన్నో ఆటంకాలు ఇబ్బందులు కలగజేసిన కూడా ప్రభువైన యేసుక్రీస్తు నామములో ఎంతో సంతోషంగా అనేకమంది ఈ యొక్క హెూసన్నా మినిస్ట్రీలో ఆదివారపు ఆరాధనకు ఇంచుమించు 700 మందికి పైగా మీ ఆరాధనలో కలుసుకోవడం జరిగింది. నిజమైన ఏసుక్రీస్తు యొక్క రాకడ దినాలలో జరిగిన ఈ ఆరాధనను ఎంతోమంది అడ్డుకోవడానికి చూసినా కూడా నిజ దేవుడు నిత్య దేవుడు సమస్తాన్ని సాధ్యం చేసే దేవుడు అలాంటి దేవునికి విరోధంగా ఏమి జరిగినా కూడా దేవుడి వాటన్నిటినీ తొలగించి ఆరాధనలో అనేకమంది చిన్న పెద్ద ముసలి వాళ్లు అని తేడా లేకుండా అందరూ కూడా యేసయ్య నామంలో ఈ ఆరాధనకు ఏకీభవించడం జరిగింది . అదేవిధంగా రెండు నెలల క్రితం ఆర్ఎస్ఎస్ వారు సంఘం కట్టకూడదని ఎన్నో ఇబ్బందులు కలగజేసిన కూడా ఎంతో అవమానం చేసినా కూడా నాని నిజమైన దేవుడు యేసు క్రీస్తు ఎక్కడైతే అవమానించబడ్డారో ఎక్కడైతే సంఘం కట్టకూడదన్నారు అదే స్థలంలో దేవుడు గొప్ప ఆరాధన అద్భుతమైన ఆరాధన అద్భుతంగా మహా ఉన్నతంగా జరిగేలా చేసిన నిజమైన దేవుడు యేసు క్రీస్తు. ఈ యొక్క ఆరాధనకు అనేకమంది గవర్నమెంట్ తరఫున పోలీసు వాళ్ళను సహకరించేలా చేసినందుకు వాళ్లకు కూడా ఏసుక్రీస్తు పేరిట కృతజ్ఞతా స్తుతులు చెల్లించుకుంటున్నాము

# జగిత్యాల పావాని హాస్పిటల్ లో 18 మందికి కంటి శాస్త్ర చికిత్సలు

# ఉచితముగా చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్




**రాయికల్ పట్టణం,అక్టోబర్ 12, ( రిపబ్లిక్ న్యూస్)**

ప్రపంచాన్ని జయించగలక్షే శక్తి ఉన్న కంటి చూపు లేక నివారించగలిగే అందత్వం ప్రపంచంలో భారతదేశంలో అత్యధిక%శీ%గ వున్నారు మానవసేవే మాధవసేవ కార్యక్రమం సమాజంలో గుర్తింపు కన్ను చాలా సున్నితమైన కాపాడుకోవాలి అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు

అపీ రోటరీ క్లబ్ జగిత్యాల్ పవని కంటి ఆసుపత్రి మరియు అపీ రోటరీ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో నిరుపేదలు 18 మందికి ఉచిత కంటి శాస్త్ర చికిత్స చేసారు డాక్టర్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అనంతరం వారికి వుచితముగా కంటే అద్దాలు మందులు పంపిని చేశారు

తన ఆరోగ్యం మంచిగా లేకుండా మన సేవే మాధవ సేవ అన్న విధంగా జగిత్యాల నియోజకవర్గంలో కాకుండా జిల్లా వ్యాప్తంగా ఎవరైనా కంటి సమస్యల కొరకు వస్తే కాదు అనకుండా తప్పనిసరి కంటి ఆపరేషన్ ఉచితముగా చేసి తన సేవలు నిరూపించుకుంటున్నాడు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అతనిని జగిత్యాల జిల్లా ప్రజలు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను అభినందిస్తున్నారు ఇలాంటి సేవలకు ముందుగా ఎవరికైనా సహాయం చేయడానికి ఆపరేషన్లు చేయడానికి ముందున్నాడు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన వృత్తిపరంగా ఎవరికైనా వేరే హాస్పిటల్లో ఉన్న వారికి అక్కడ డాక్టర్ తో మాట్లాడి బిల్లు తక్కువ చేయించి మళ్లీ సీఎం రిలీఫ్ ఫండ్ లో వారికి చేయూతలో ముందున్నాడు






# పుంజుకున్న రియల్ రంగం

## రాష్ట్రంలో నిర్మాణ రంగ వృద్ధిరేటు

## 11.97 శాతం పెరుగుదల

## మూడు నెలల్లో ఏఐ సిటీకి భూమి పూజ

## : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్ అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):**
తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగం 2024–25లో గణనీయమైన వృద్ధి రేటు సాధించిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలెప్ మెంట్ కౌన్సిల్(నారెడ్కో) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో నిర్వహిస్తున్న '15వ నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో'లో ఆయన ఆదివారం పాల్గొని ప్రసంగించారు. '2024–25లో రియల్ ఎస్టేట్, వ త్తిపరమైన సేవల రంగం 15.4 శాతం వ ద్ధి రేటును నమోదు చేసింది. 11.97 శాతం వ ద్ధి రేటుతో నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80వేల కోట్లకు పైగా సమకూర్చింది. స్టేట్ సర్వీసెస్ జీఎస్ డీపీలో ఈ రెండు రంగాల వాటానే 24.9 శాతంగా ఉంది' అని అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాల పరిధిలో 2024 సెప్టెంబర్‌లో రూ.2,820 కోట్ల విలువైన 4,903 ఇండ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. గతేడాదితో పోల్చితే 35 శాతం అధికమని చెప్పారు. సెప్టెంబర్‌లో రూ.కోటిపైన విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో 151 శాతం, మొత్తం విక్రయాల్లో విలువ పరంగా వీటి వాటానే 53 శాతంంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో




రియల్ ఎస్టేట్ కుదేలయ్యిందంటూ దుష్ప్రచారం చేస్తున్న వారికి ధీటైన సమాధానమే ఈ గణాంకాలని పేర్కొన్నారు. 'ఇండియాలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. అయితే%% అభివృద్ధి చెందిన దేశాల జీడీపీలో స్థిరాస్తి రంగ వాటా సగటున 10 నుంచి 15 శాతం కాగా, చైనాలో అత్యధికంగా 23నుంచి 25 శాతం వరకుంది. మన దేశంలో ఇది 6 శాతం నుంచి 8 శాతమే. ఇది మరింత పెరగాల్సిన అవసరముంది' అని శ్రీధర్‌బాబు అభిప్రాయపడ్డారు. 'ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో ఫేజ్ 2, ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ, రీజినల్ రింగ్ రోడ్డు తదితర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు మారిపోనున్నాయి. డిసెంబర్ నాటికి 'ఫ్యూచర్ సిటీ'లో జోనలైజేషన్ ప్రక్రియను పట్టలెక్కించాలనే పట్టుదలతో ఉన్నాం. అక్కడే 200 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్న ఏఐ సిటీకి మూడు నెలల్లోనే భూమి పూజ చేయబోతున్నాం' అని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నారెడ్కో తెలంగాణ ప్రతినిధులు విజయసాయి మేక, కాళీ ప్రసాద్ దామెర, డా.లయన్ కిరణ్, కె.శ్రీధర్ రెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జేపీసీ ఏర్పాటు...

## చైర్మన్ గా ఆర్.కృష్ణయ్య

### న్యాయం కోసం ఈ నెల 18న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు

### చట్టసభల్లో బిల్లు పెట్టేవరకు పోరాటం ఆగదని కృష్ణయ్య స్పష్టీకరణ

**హైదరాబాద్ అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):**
తెలంగాణలో వెనుకబడిన తరగతుల (బీసీ) హక్కుల సాధన ఉద్యమం కొత్త రూపు సంతరించుకుంది. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లను సాధించడమే ఏకైక లక్ష్యంగా బీసీ సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి 'తెలంగాణ బీసీ జేఏసీ' (జాయింట్ యాక్షన్ కమిటీ)ని ఏర్పాటు చేశాయి. ఈ ఐక్య కార్యాచరణ కమిటీకి చైర్మన్‌గా సీనియర్ నేత ఆర్. కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా వీజీ నారగోని ఏకగ్రీవంగా నియమితులయ్యారు. వీరితో పాటు మరో ఆరుగురు కీలక సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో



ఆదివారం జరిగిన ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లపై కోర్టు ఏ కారణంతో స్టే ఇచ్చిందో స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రకటన వెలువడ్డాక స్టే ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు. బీసీలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఈ నెల 18న రాష్ట్రవ్యాప్త బంద్‌కు ఆయన పిలుపునిచ్చారు."గత 76 ఏళ్లుగా బీసీలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పుడు దానికి అవమానం కూడా తోడైంది. మా హక్కుల కోసం చట్టసభల్లో బిల్లు ప్రవేశపెట్టే వరకు ఈ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదు" అని ఆర్. కృష్ణయ్య స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యమం బలంగా జరిగితే కేంద్ర ప్రభుత్వంపై కూడా ఒత్తిడి పెరుగుతుందని ఆయన అన్నారు. బీసీ సమాజం ఐక్యంగా నిలబడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జేడీయూ, బీజేపీ చెరో 101 స్థానాల్లో పోటీ

## బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు కుదిరిన ఎన్‌డీఏ సీట్లు పంపకం

## ఎల్‌జేపీకి 29, ఆర్‌ఎల్‌ఎం, హెచ్‌ఎఎంలకు చెరో ఆరు స్థానాలు

## సీట్ల పంపకాలపై నేడు ప్రతిపక్ష పార్టీల సమావేశం

పాట్నా : బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల పంపకాలు పూరయ్యాయి. బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాలకు సీట్ల షేరింగ్ ఫార్ములా ఖరారైంది. ఆదివారం నాడిక్కడ జరిగిన ఉన్నత స్థాయి సమావేశం అనంతరం అధికారిక ప్రకటన వెలువడింది. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అధికారికంగా సామాజిక మాధ్యమంలో ఇందుకు సంబంధించిన వివరాలు ప్రకటించారు. అలాగే ఆర్‌ఎల్‌ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాహా కూడా ఎక్స్‌లో సీట్ల పంపకం తుది ఒప్పందాన్ని ధ్రువీకరించారు. బీహార్ అసెంబ్లీ సీట్ల మొత్తం సంఖ్య 243 కాగా.. బీజేపీ, జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) చెరో 101 సీట్లలో పోటీ చేయనున్నాయి. అలాగే భాగస్వామ్య పార్టీలైన లోక్ జన్ శక్తి (ఎల్‌జేపీ)కి 29 సీట్లు కేటాయించారు.
కేంద్ర మంత్రి, మాజీ ముఖ్యమంత్రి జితిన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్థాన్ అవామీ మోర్చా (హెచ్‌ఎంఎస్)కు ఆరు సీట్లు, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుష్వాహా నేతత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం)కు ఆరు సీట్లు కేటాయించారు. ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలు ఈ కేటాయింపులను స్వాగతించినట్లు కూటమి నేతలు వెల్లడించారు. తమ కూటమి బీహార్‌లో తిరిగి అధికారం చేపట్టగలదనే ధీమాను వ్యక్తం చేశారు. బీహార్‌లోని ఎన్‌డీఏ సీట్ల పంపకాల ఒప్పందం స్నేహపూర్వక వాతావరణంలో కుందరిందని, కూటమి విజయం కోసం బలంగా ఉందని జేడీయూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా తెలిపారు.



ఎన్‌డీఏ భాగస్వామ్య నేతలు ఐక్యత, పరస్పర గౌరవం స్ఫూర్తితో సీట్ల భాగస్వామ్యాన్ని ఖరారు చేశామని ఉపేంద్ర కుష్వాహా తెలిపారు.

**వంద స్థానాల్లో ఎంఐఎం పోటీ**
బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం వంద స్థానాల్లో పోటీ చేయనుంది. ఇండియా బ్లాక్‌తో కలిసి పోటీ చేసేందుకు యత్నించిన ఎంఐఎం, ఒంటరి పోరుకు సిద్ధపడింది. దాదాపు వంద స్థానాల్లో పోటీ చేసేందుకు యోచిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సంఖ్య గత ఎన్నికల్లో పోటీ చేసిన సంఖ్య కంటే ఐదు రెట్లు ఎక్కువగా ఉంది. బీహార్‌లో మూడో పత్యామ్నాయం నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎంఐఎం బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ తెలిపారు.

**నేడు ప్రతిపక్ష ఇండియా బ్లాక్ చర్చలు**
బీహార్‌లోని ప్రతిపక్ష 'మహాఘట్‌బంధన్' నేడు సీట్ల పంపకాన్ని ఖరారు చేసే అవకాశం ఉంది. అలాగే ఈ వారం ఉమ్మడి మ్యానిఫెస్టోతో పాటు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. ఆర్‌జేడీ, కాంగ్రెస్ మధ్య చర్చలు జరుగుతున్నాయని, ఆర్‌జేడీకి చెందిన లాలూ ప్రసాద్, తేజస్వి యాదవ్ దేశ రాజధానిలో ఉన్నందున వారి నాయకత్వం సోమవారం సమావేశం కావచ్చని ఆయా వర్గాలు తెలిపాయి. అలాగే మహాఘట్‌బంధన్‌లో భాగమైన వికాషీల్ ఇన్సాన్ పార్టీ (వీపీఐ) అధ్యక్షుడు ముకేశ్ షహాని కూడా ఢిల్లీకి చేరుకున్నారు. "కాంగ్రెస్ అధ్యక్షుడు బీహార్‌లోని అన్ని సంకీర్ణ భాగస్వామ్య పార్టీలతో మాట్లాడుతున్నారు. కాంగ్రెస్, ఇతర పార్టీలు తాము బలంగా ఉన్నాయని భావిస్తున్న కొన్ని స్థానాల్లో అభ్యర్థులను నిర్ణయించడానికి తుది చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు గత రెండు రోజులుగా బీహార్‌లోని అన్ని రాజకీయ నాయకులతో మాట్లాడుతున్నారు" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు.
ఆర్‌జేడీ, కాంగ్రెస్ నాయకత్వాల మధ్య చర్చలు కూడా కొనసాగుతున్నాయని, సోమవారం రెండు ప్రధాన పార్టీల నాయకులు కూడా సమావేశం కావచ్చని ఆయన అన్నారు. " మహాఘట్‌బంధన్" లో కొంతమంది కొత్త భాగస్వాములకు సీట్లు సర్దుబాటు చేయాల్సి ఉంది. సీట్ల పంపకాలలో కూడా వారిని సర్దుబాటు చేసుకోవాలి" అని అన్నారు. "రాబోయే రెండు, మూడు రోజుల్లో అన్ని సీట్లను ఖరారు చేసి ప్రకటిస్తాం" అని ఆయన అన్నారు. గత బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ 70 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి 19 స్థానాల్లో విజయం సాధించగా, ఆర్‌జేడీ 144 స్థానాల్లో పోటీ చేసి 75 స్థానాల్లో విజయం సాధించింది. షెడ్యూల్ ప్రకారం, బీహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రెండు విడతలుగా నవంబర్ 6, 11 తేదీల్లో జరగనున్నాయి. నవంబర్ 14న ఫలితాలు వెలువడతాయి.

# మిత్రబృందంపై మృత్యుపంజా

## రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం.. కారును ఢీకొన్న పలు వాహనాలు

## మృతుల్లో ఇటీవలే పెళ్లైన, 31న పెళ్లి కావాల్సిన ఇద్దరు యువకులు

## కర్ణాటకలోని హొసూరు సమీపంలో ఘటన



హొసూరు(క్రైం), **అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):**
ఐదునెలల క్రితం పెళ్లి చేసుకున్న మిత్రుడు కెనడా నుంచి వస్తున్నాడని... తీసుకువచ్చేందుకు మిత్రబృందం విమానాశ్రయానికి వెళ్లింది. వారిలో ఈనెల 31న పెళ్లి కావలసిన యువకుడు కూడా ఉన్నాడు. అంతా ఆనందంగా తిరిగి వస్తుండగా రోడ్డుప్రమాద రూపంలో మృత్యువు వారిని కాటేసింది. వీరు ప్రయాణిస్తున్న కారును ఒక లారీతో పాటు పలు వాహనాలు ఢీకొనడంతో నలుగురూ అక్కడికక్కడే మృతిచెందారు. కర్ణాటక రాష్ట్రం హొసూరు సమీపంలోని గోపసంద్రం వద్ద బెంగళూరు–చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. తమిళనాడులోని ఈరోడ్ జిల్లాకు చెందిన మదన్‌కుమార్ (27) ఐటీ ఉద్యోగి. ఇతడికి ఐదు నెలలక్రితం వివాహమైంది. దీపావళి సెలవుల కోసం కెనడా నుంచి వచ్చాడు. అతడిని తీసుకొచ్చేందుకు తమిళనాడులోని సేలం ప్రాంతం ఓమలూరుకు చెందిన ముగిలన్ (30), బెంగళూరులోని చిక్కనాగమంగల ప్రాంతానికి చెందిన మణివణ్ణన్ (27), గోకుల్ (28) వెళ్లారు. అంతా కలిసి కారులో ఈ రోడ్‌వైపు బయల్దేరారు. గోపసంద్రం వద్ద వ్యాన్ అడ్డు రాడంతో కారు సడన్ బ్రేక్ వేసి ఆపారు. ఆ సమయంలో వెనకే వేగంగా వస్తున్న లారీ వీరి కారును ఢీకొంది. వెనుక వచ్చిన మరో 3, 4 వాహనాలు కూడా ఢీకొన్నాయి. దీంతో కారు నుజ్జునుజ్జయింది. అందులోని నలుగురు యువకులు చనిపోయా రు. ప్రమాద సమయంలో కారును మణివణ్ణన్ డ్రైవింగ్ చేస్తున్నాడు. ఇతడు యూపీఎస్సీ పరీక్షలు రాసి ఫలితాల కోసం వేచిచూస్తుండేవాడు. ఈనెల 31న పెళ్లి జరగాల్సి ఉంది. ముగిలన్, గోకుల్ కూడా టెకీలే.

# వచ్చే ఐదేళ్లలో 40 లక్షల ఎఐ ఉద్యోగాలు..!

**హైదరాబాద్ అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):**

ప్రపంచవ్యాప్తంగా ఐటి రంగంలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా ఎఐ, ఆటోమేషన్ జోరుతో నిన్న మొన్నటివరకూ సేఫ్ అనుకున్న ఐటి ఉద్యోగాలు కాస్తా ఆవిరవుతున్నాయి. భారత్‌లో ఎఐ ఉద్యోగాలపై నీతి ఆయోగ్ అంచనాలను వెల్లడించింది. 2030 నాటికి అంటే వచ్చే ఐదేళ్లలోనే భారత్‌లో 40 లక్షల ఎఐ ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని నీతి ఆయోగ్ ఆదివారం వెల్లడించింది. ముఖ్యంగా టెక్, కస్టమర్ ఎక్స్ పీరియన్స్ రంగాల్లోనే ఎక్కువ ఉద్యోగాలను ఎఐ సృష్టించబోతున్నట్లు తెలిపింది. నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రమణ్యం ఈ వివరాలు వెల్లడించారు. నాస్కామ్ బిసిజితో కలిసి ఈ నివేదిక తయారు చేసింది. 2035 నాటికి భారత్ ఎఐ రంగంలో గ్లోబల్ హబ్ గా మారబోతోందని ఈ నివేదికలో తెలిపారు. ఎఐ దూకుడు కారణంగా క్వాలిటీ అష్యూరెన్స్ ఇంజనీర్లు, లెవెల్ 1 సపోర్టింగ్ ఏజెంట్ల వంటి ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని ఈ నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం వివిధ రంగాల్లో ఎఐ నైపుణ్యాల వృద్ధి, ఆవిష్కర ణలు జరగకపోతే ఉద్యోగాలకు ముప్పు తప్పదని



హెచ్చరించింది. ఇవి జరిగితే మాత్రం జాతీయ స్థాయిలో ఆయా ఉద్యోగులు ఆస్తులుగా మార తారని తెలిపింది. ఎఐ దూకుడు కారణంగా టెక్నికల్, ఇంజనీరింగ్ విభాగాల్లో పెనుమార్పులు తథ్యమని చెబుతోంది. ఏఐ కారణంగా ఎఐ ఇంజనీర్, మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్, డేటా సైంటిస్ట్, డేటా ఇంజనీర్, రోబోటిక్స్ ఇంజనీర్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ ఇంజనీర్ వంటి ఉద్యోగాల రాక పెరగనుందని నీతి ఆయోగ్ నివేదిక చెబుతోంది. వీటితో పాటు కొత్త ఉద్యోగాలైన ఎఐ ప్రాంప్ట్ ఇంజనీర్స్, ఎఐ ఎథిక్స్ స్పెషలిస్ట్, ఎఐ ట్రైనర్స్, ఎఐ ప్రొడక్ట్ మేనేజర్స్, ఎఐ కస్టమర్ ఎక్స్ పీరియన్స్ స్పెషలిస్ట్, ఎఐ లిటరసీ ట్రైనర్స్, స్పెషలిస్ట్, ఎఐ హెల్త్ కేర్ స్పెషలిస్ట్, సైబర్ సెక్యూరిటీ ఎనలిస్ట్ వంటివి కూడా రాబోతున్నట్లు వెల్లడించింది.

# జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిగా దీపక్‌రెడ్డి?

## పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో నిర్ణయం

## పార్టీ పార్లమెంటరీ బోర్డు ఆమోదముద్ర!

## ఏ క్షణమైనా ప్రకటన వెలువడే అవకాశం

న్యూఢిల్లీ, **అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా దీపక్‌రెడ్డి పేరును పార్టీ జాతీయ నాయకత్వం ఎంపిక చేసినట్టు సమాచారం. ఆదివారం ఢిల్లీలో జరిగిన బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోగా, పార్టీ పార్లమెంటరీ బోర్డు ఆమోద ముద్ర వేసినట్టు తెలిసింది. జూబ్లీహిల్స్‌లో పోటీ కోసం దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, పద్మ పేర్లతో కూడిన జాబితాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు శనివారమే పార్టీ జాతీయ నాయకత్వానికి అందించారు. ఆదివారంజరిగిన కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో



దీనిపై చర్చించారు. నియోజకవర్గంలో లక్ష మంది ముస్లిం ఓటర్లు ఉన్న నేపథ్యంలో.. బీజేపీ నుంచి ఎవరిని పోటీపెడితే బాగుంటుందన్న దానిపై కసరత్తు చేసినట్టు తెలిసింది. హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో పోటీచేసిన మాధవీలత అభ్యర్థిత్వం అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. తర్వాత ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో ప్రధాని మోదీ అధ్యక్షతన ఆదివారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశం జరిగింది. ఇందులోనూ దీపక్‌రెడ్డి వైపే మొగ్గుచూపినట్టు తెలిసింది. ఏక్షణమైనా ప్రకటన చేయవచ్చుని పార్టీవర్గాలు వెల్లడించాయి.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# ప్రధాని పర్యటన సందర్భంగా శ్రీశైలం నందు పటిష్ట బందోబస్తు ఏర్పాటు...

**బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ ఐపిఎస్**





**శ్రీశైలం, అక్టోబర్ 12,(రిపబ్లిక్ న్యూస్):** అక్టోబర్ 16 న భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రముఖ పుణ్యక్షేత్రం జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం నందు పర్యటించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోనున్న సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది.ఇప్పటికే శ్రీశైల పరిసర ప్రాంతాలలు, నల్లమల్ల అడవి ప్రాంతాలలో గ్రేహౌండ్స్ సాయిధ బలగాలు ప్రధాని పర్యటనకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ %ఖూా% ప్రధాని పర్యటించే ప్రదేశాలలో అనగా హెలిపాడ్,రోడ్డు మార్గం, భ్రమరాంబ గెస్ట్ హౌస్, గుడి పరిసర ప్రదేశాలు, సేఫ్ హౌస్ మొదలగు ప్రాంతాలలో పర్యటించి భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తీసుకోవలసిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలిక రద్దు

## జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్



**నంద్యాల క్రైం, అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా పోలీసు కార్యాలయంలో నేడు (సోమవారం) జరగవలసిన" ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమము"ను కొన్ని అనివార్య కారణాలవల్ల తాత్కలికంగా రద్దు చేసినట్లు ఆదివారం జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్జీదారులు సుదూర ప్రాంతాల నుండి వ్యయ, ప్రయాసలతో జిల్లా పోలీసు కార్యాలయంలోని జిల్లా ఎస్పీ పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమమునకు రావొద్దని తెలిపారు. జిల్లా ప్రజలు ( ఫిర్యాదుదారులు) ఈ విషయాన్ని గమనించగలరని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. వచ్చే సోమవారం(అక్టోబర్ 20వ తేది) నుండి జిల్లా పోలీసు కార్యాలయంలో " పోలీసు పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం" యధావిధిగా కోనసాగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# నేడు ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ

**అర్జీలు "meekosam.ap.gov.in'లో నమోదు చేసుకోవచ్చు**

**సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100 -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):**ఈ నెల 13న (సోమవారం) నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా, ఆన్లైన్‌లో **meekosam.ap.gov.in** ద్వారా కూడా సమర్పించవచ్చన్నారు.అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని ఆమె చెప్పారు.అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు.అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

# పత్తికొండలో సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను పంపిణీ



**పత్తికొండ ప్రతినిధి, అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్)** ఆదివారం నాడు,గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చిందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. పత్తికొండ లో 41 మందికి సీ.ఎం.ఆర్.ఎఫ్ ద్వారా మంజూరైన రూ.35 లక్షలను ఎం.ఎల్.ఏ కే ఈ,శ్యామ్ కుమార్ తో కలిసి ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్బంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

# 7,300 మంది పోలీసులతో భద్రత

**ప్రధాని పర్యటన కట్టుదిట్టమైన భద్రత -భద్రతా ఏర్పాట్ల పై బందోబస్తు నిమిత్తం విచ్చేసిన సెక్టార్ పోలీసు ఉన్నతాధికారులు, లైజనింగ్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేసిన.జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.**







**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 12)** ఈ నెల 16 వ తేదీన కర్నూలులో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ పకడ్బందీ భద్రతా ఏర్పాట్ల గురించి బందోబస్తు నిమిత్తం వచ్చిన సెక్టార్ , లైజనింగ్ పోలీసు అధికారులతో మాట్లాడి దిశా నిర్దేశం చేశారు. ఈ సంధర్బంగా ఆదివారం కర్నూలు , ఓర్వకల్లు మండలం , నన్నూరు దగ్గర ఉన్న రాగమయూరి గ్రీన్ హిల్స్ లో బహిరంగ సభ ప్రాంతం దగ్గర ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో ప్రధాని పర్యటన ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించారు. అనంతరం పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ మాట్లాడుతూ. పార్కింగ్ ప్రదేశాలు, రూట్ డైవర్షన్స్ గురించి , జియోగ్రాఫికల్ మ్యాప్ ను చూపిస్తూ మాట్లాడారు. ప్రధాని పర్యటన నిమిత్తం 7,300 పోలీసు బలగాలను బందోబస్తు కు వినియోగిస్తున్నామన్నారు.ప్రధాని మోదీ పర్యటించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం ఏరియాల నుండి వచ్చే వాహనాలను నాగాలాపురం దగ్గర ట్రాఫిక్ మళ్ళింపు చేయాలన్నారు. బస్తిపాడు, చిన్న టేకూరు , తడకన పల్లి మీదుగా నన్నూరు రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునే విధంగా చేయాలన్నారు. డోన్, ప్యాపిలి, తుగ్గలి, పత్తికోండ ఏరియాల నుండి వచ్చే వాహనాలు నేషనల్ హైవే కు వచ్చి తడకన పల్లి మీదుగా నన్నూరు రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునే విధంగా చేయాలన్నారు. కర్నూలు మీదుగా నుండి వచ్చే వాహనాలు నన్నూరు టోల్ గేట్ దాటి తర్వాత రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునే విధంగా చేయాలన్నారు. నంద్యాల , ఆళ్ళగడ్డ, బనగానపల్లె ఏరియాల నుండి వచ్చే వాహనాలు నంద్యాల రోడ్డు లో వచ్చి రాగమయూరి పార్కింగ్ దగ్గర ఏర్పాటు చేసిన ప్రదేశానికి చేరుకునే విధంగా చేయాలన్నారు.

ఆయా నియోజక వర్గాల నుండి వచ్చే వాహనాలను ఏవిధంగా పార్కింగ్ ప్రదేశాలకు మళ్ళింపు చేయాలనే విషయాల పై చర్చించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నియోజక వర్గాల వారిగా కేటాయించిన పార్కింగ్ ఏరియాలలలో వారి వాహనాలను ఏర్పాటు చేసుకునే విధంగా చేయాలన్నారు. పార్కింగ్ ఏరియాలలో ఇండికేషన్ సైన్ బోర్డ్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఆఫీసియల్స్ కి నెంబర్ 2 పార్కింగ్ ఏరియా ను కేటాయించడం జరిగిందన్నారు. ట్రాఫిక్ డైవర్సన్స్ గురించి, విఐపి కాన్వాయ్ రూట్ , ఏయే నియోజక వర్గాల నుండి ఎంత మంది ప్రజలు వస్తున్నారని, క్రౌడ్ కంట్రోల్ ఏవిధంగా చేయాలనే విషయాల గురించి బందోబస్తు వివరాల గురించి, జియోగ్రాఫికల్ మ్యాప్ ను చూపిస్తూ వివరిస్తూ దిశా నిర్దేశం చేశారు . ప్రతి సెక్టార్ ఇంచార్జ్ పోలీసు ఉన్నతాధికారులకు, లైజనింగ్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు.

వివిఐపిల పార్కింగ్, వివి ఐపిల గ్యాలరీల దగ్గర అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఎస్పీలు పరమేశ్వర్ రెడ్డి, దేవరాజ్, మాధవ్ రెడ్డి, దీపికా పాటిల్ , జి. కృష్ణకాంత్ , కృష్ణకాంత్ పటేల్,శ్రీనివాసరావు, మణికంఠ చందవోలు, దీరజ్ కునుబిల్లి, షెల్కే నచికేత్ విశ్వనాథ్ , చక్రవర్తి, లక్ష్మీనారాయణ, ట్రైనీ ఐపియస్ లు , అడిషనల్ ఎస్పీలు , డిఎస్పీలు, సిఐలు, ఆర్ ఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

# ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి టీజీ భరత్





**కర్నూలు, ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 12)** ఈ నెల 16వ తేదీన ప్రధానమంత్రి జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పరిశీలించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా నన్నూరు టోల్ గేట్ దగ్గర ఉన్న రాగమయూరి వద్ద సభ ప్రాంగణం ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16వ తేదిన శ్రీశైలం దర్శనం పూర్తి చేసుకున్న అనంతరం కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన సభకు రానున్నారన్నారు. సభకు హాజరవడంతో పాటు వర్చువల్ విధానం ద్వారా వివిధ ప్రాజెక్ట్ ల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు.. ఇప్పటికే ఏర్పాట్లు అని కూడా దాదాపుగా పూర్తి అయ్యాయి అన్నారు. ప్రధాన మంత్రి పర్యటనను విజయవంతంగా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.మంత్రి వెంట ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు..

# రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో సీసీ కెమెరాలు

**విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం : మంత్రి సవిత**



రాజమహేంద్రవరం, **అక్టోబర్ 12, (రిపబ్లిక్ న్యూస్):**రాష్ట్రవ్యాప్తంగా బీసీ హాస్టళ్లను మెరుగు పరిచే దిశగా చర్యలు వేగవంతం చేస్తున్నాం. ప్రతీ వసతిగృహం, గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రాష్ట్ర బీసీ సం క్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. తూ ర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల బీసీ సంక్షేమ, చేనేత, జౌళి, లేపాక్షి శాఖల అధికారులతో ఆమె సమీక్షిం చారు. బీసీ వసతి గృహాల పరిస్థితిపై ఆరా తీశా రు. సామాజిక బాధ్యతగా సీఎస్ఆర్ నిధులతో బీసీ హాస్టళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థు లకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉంచాలన్నారు. దోమలు రాకుం డా మెస్‌లను ఉంచాలని, వేడి చేసి చల్లార్చిన నీరు, తాజాగా వండిన ఆహారం మాత్రమే విద్యార్థులకు అందించాలన్నారు. విశ్రాంతి, తర గతి గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉం చాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడుకోవడానికి క్వాయిన్ ఫోన్ సౌకర్యం కల్పించాలని ఆమె సూచించారు. మధ్యాహ్నం భోజన పథకం అమలు సక్రమంగా ఉండాలని, వసతి గృహాల్లోని విద్యార్థులను అధి కారులు తమ పిల్లలుగా భావించి బాధ్యతగా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తరచూ గురుకుల పాఠశాలలు, వసతిగృహాలు సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు విధానం, పరిశుభ్రతను పరిశీలించాలన్నారు.

### ఆప్కో, లేపాక్షి విక్రయాల పెంపు

ఆప్కో, లేపాక్షి విక్రయాలు పెంచడానికి చర్య లు తీసుకుంటున్నామని.. ఇప్పటికే మార్కెట్‌లో ఆప్కో రెడీమేడ్ వస్త్రాలు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. మేక్ ఇండియా -మేడ్ ఇండి యా దిశగా స్వదేశీ వస్తువులను ప్రజల్లోకి తీసు కుని వెళ్లి అలవాటు చేయాలన్నారు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో పథకాల అమలు మరింత వేగవంతం కావాల్సి ఉందని చెప్పారు. ఈ ప్రాంతాల్లో 16 ఆప్కో షాపులు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, ఆంధ్రప్రదేశ్ బీసీ కో ఆపరేటివ్‌గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, ఆర్డీవో ఆర్. కృష్ణనాయక్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి.శశాంక, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, ఆ ప్కో జీఎం కె.పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com